
మే2022
రు. 20/-
సంకల్ప బలం
సామాజిక విలువల మాసపత్రిక
మాతృదివస శుభాకాంక్షలు


మే 6 న శంకర జయంతి




# చైతన్యం
సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

మే 2022

వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి

సంపుటి -11 సంచిక - 8


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అక్షరమాల | 7 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 9 |
| మాతృదేవోభవ | 14 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 12 |
| యాత్రాస్థలి సింహాళం | 23 |
| 116 కందాల్లో సుందరకాండ | 26 |
| దేవదేవుని పంచభూత లింగాలు | 29 |
| ప్రేమంటే ఇంతే | 35 |
| హాస్యమా నీవెక్కడ | 38 |
| ఆచార్య జయధీర్ తిరుమలరావు | 42 |
| మాతృభూమి | 46 |
| హితోక్తులు | 49 |
| అమ్మను మించిన దైవము లేదు | 50 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## 75+ అంతర్జాతీయ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు .

మే నెల 8వ తేదీన అంతర్జాతీయ మాతృ దినోత్సవం. అమ్మలందరినీ సంతోషంగా ఉంచడానికి, పిల్లలు తమ ప్రేమను చూపించడానికి ముఖ్యమైన రోజు. అమ్మ అనే పదం ఎంత మధురమైనదో, అమ్మను ఆనంద పరిస్తే కూడా జీవితం అంత మధురంగా ఉంటుంది అనడంలో సందేహం లేదు. ఈ మాతృ దినోత్సవం అమెరికాలో ప్రారంభమైందని కొందరు నమ్ముతారు. చాలా దేశాలలో ఇది మే 2 వ ఆదివారం జరుపుకుంటారు.

ఆధ్యాత్మికత పరంగా కార్తీక మాఘ మాసాల తర్వాత అంతటి మహాత్యాన్ని సొంతం చేసుకున్న పుణ్యప్రదమైన మాసం వైశాఖ మాసం. ఈ నెలలో పూర్ణిమ తిథి నాడు విశాఖ నక్షత్రం ఉండడం వల్ల ఈ మాసానికి వైశాఖ మాసం అని పేరు ఏర్పడింది. ఆధ్యాత్మికత, దైవ శక్తి, ఉన్న నెలల్లో వైశాఖమాసానికి ప్రత్యేక స్థానం ఉంది, ఇది శ్రీ మహా విష్ణువుకు అత్యంత ప్రీతికరమైన నెల. శ్రీ మహా విష్ణువును, లక్ష్మీ దేవిని ఈ మాసంలో తులసి దళాలతో పూజిస్తే ముక్తి లభిస్తుంది.

ఇదే మాసంలో మే 6 వ తేదీన శంకర జయంతి, మే 16 న అన్నమాచార్య జయంతి, మే 25 న హనుమాన్ జయంతి జరుపుకుంటారు. ఈ విధంగా పండుగల వాతావరణమే కాక, ఉపనయనాలతో, వివాహాది శుభకార్యాలతో ఈ మాసం అందరికీ పండుగ వాతావరణంతో సందడిగా సాగుతుంది.

## GHMC కి రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను

ఎర్లీ బర్డ్ ఆఫర్ స్కీమ్ తో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) కి రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు అయ్యింది. ఏప్రిల్ నెలలోనే 742. 41 కోట్ల ఆస్తిపన్ను వసూలైనట్లు GHMC వెల్లడించింది. అందులోను ఎర్లీ బర్డ్ ఆఫర్ లో భాగంగా ఏప్రిల్ లోపు ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రిబేటు ఇచ్చింది. ఈ ఆఫర్ లో భాగంగా రూ 6 వేల కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయాలని బల్దియా లక్ష్యంగా పెట్టుకుంది. టార్గెట్ కన్నా 142. 41 కోట్లు అధికంగా వసూలైనట్లు GHMC తెలిపింది. ఈ ఆఫర్ ముగిసింది.

## పాఠశాలలు తెరిచినా .... పుస్తకాలు ఎక్కడ ?

హైదరాబాద్ రాష్ట్రంలో ఈ సారి సకాలంలోనే జూన్ నుంచి పాఠశాలలు, జూనియర్ కళాశాలలు తెరుస్తారు. తెరిచే నాటికి విద్యార్థులు పుస్తకాలు లేకుండా చదువు కోవలసి వస్తోంది. ఈ సారి నెల 15 రోజుల పాటు ఇబ్బందే. కారణం రెండు భాషల్లో ముద్రణతో మరింత ఆలస్యం అయ్యి, విద్యాశాఖ లక్ష్యం నెరవేరడం లేదు.

రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలలు, ఇంకా మోడల్ స్కూళ్ళు, కేజీబీవీల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇస్తున్న విషయం తెలిసిందే. వాటిలో 24 లక్షల మంది చదువుతున్నారు. పుస్తకాల ముద్రణకు అవసరమైన 7,500 ల టన్నుల కాగితాన్ని పాఠశాల విద్యాశాఖ కొని ముద్రణకు అందజేస్తుంది. మొత్తానికి జూన్ నెలాఖరుకి పుస్తకాలను పాఠశాలకు చేర్చాలని విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

కరోనాతో ఇన్నాళ్ల నుండి అసలే స్కూళ్ళకు, పాఠాలకు నోచుకోక పిల్లలు ఇబ్బంది పడుతుంటే, ఇప్పటికైనా పిల్లలకు అన్నీ సిద్ధం చెయ్యద్దా? అని అటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి తండ్రులు విమర్శిస్తున్నారు.

## స్వతంత్ర భారత దేశంలో చేనేతపై పన్నా ?

నేత కార్మికులపై భాజాపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విషం చిమ్ముతోంది అని, స్వతంత్ర భారతదేశంలో చేనేత కార్మికులపై పన్ను వేసిన తొలి ప్రధాని నరేంద్ర మోడీ అని రాష్ట్ర మంత్రి KTR ధ్వజమెత్తారు. కరోనా సంక్షోభంలోనూ జౌళి రంగంపై మోడీ పన్నుల భారం వేశారని, దీంతో చేనేత రంగం ఇబ్బంది పడుతోందని తెలిపారు. చేనేత జౌళి రంగంపై KTR సంజయ్ కి బహిరంగ లేఖ వ్రాసారు.

## బీరే కదా అని ఆరోగ్యంతో ఆటలాడుకోకండి !

ఎండలు మండి పోవడంతో ... ఉపశమనం కోసం అత్యధికులు బీరు తాగేస్తున్నారు. తాగేది బ్రాందీ కాదు బీర్ కదా అని చాలా మంది సమర్థించుకుంటున్నారు. కానీ బీరులోనూ ఆల్కహాలు ఉంటుంది, ఇలాం-

టప్పుడు బీరే కదా అని పరిమితికి మించి తాగితే ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుందని, కాలేయానికి ముప్పు తప్పదంటున్నారు నిపుణులు. గత సంవత్సరంతో పోలిస్తే 45 శాతం అమ్మకాలు పెరిగాయి అంటే ఆలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రేపల్లె లో అత్యాచార కేసు

బాపట్ల జిల్లాలోని రేపల్లె రైల్వే స్టేషన్ లో మహిళపై సామూహికంగా అత్యాచారం జరగడం అత్యంత బాధాకరం. మనిషి గా జన్మ నెత్తి పశువు కన్నా దారుణంగా ప్రవర్తిస్తున్నారంటే, భారత దేశంలోను అందులోను ఆంధ్రప్రదేశ్ లో పుట్టడం సిగ్గు చేటు. మళ్ళీ ఏ ఒక్కరూ ఇటువంటి ఘోరమైన పనులు చెయ్యకుండా కఠిన మైన శిక్షలు వేయవలసిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రజలు వాపోతున్నారు. ఆ నిందితులను వెంటనే పట్టుకున్న పోలీసులు అభినందనీయులు. కానీ ఇలాగే ఎవరు తప్పు చేసినా కూడా వారినైనా ఇలాగే ఎంత పరపతి అధికారం డబ్బు ఉన్న వారైనా తప్పు చేస్తే సామాన్యుడికి విధించే దండన విధించినప్పుడే, ఇటువంటివి ఎవరూ చెయ్యడానికి సాహసించరు. పిల్లలను జాగ్రత్తగా పెంచవలసిన బాధ్యత తల్లిదండ్రులదైతే, తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

## విజయవాడలో డ్రగ్స్ కలకలం

విజయవాడలో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. సత్తెనపల్లికి చెందిన సాయి గోపి అనే వ్యక్తి పార్శిల్ డీటీఎస్ కొరియర్ పంపగా అందులో డ్రగ్స్ ఉన్నట్లు బెంగుళూరులో గుర్తించారు. ఈ పార్సెల్ విజయవాడ డీటీఎస్ కొరియర్ నుండి ఆస్ట్రేలియాకు పంపగా వివరాలు సరిగా లేక కెనడా వెళ్లింది. కెనడా నుండి వెనక్కి వస్తుండగా ... బెంగుళూరులో ఆ డ్రగ్స్ పార్శిల్ ను బెంగుళూరు లోని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. అందులో 4 కేజీల డ్రగ్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ కొరియర్ అబ్బాయిని అరెస్ట్ చేసి, సాయి గోపి ఇచ్చిన ఆధార్ కార్డు నకిలీదని విచారణలో తేలడంతో విజయవాడ పోలీసులకు సమాచారం అందించారు.

## దేశంలో ఉమ్మడి పౌర స్మృతి .... అస్సాం సీఎం వ్యాఖ్య

మన దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (uniform civil code) తీసుకురావాల్సిన అవసరం ఉందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. ఏ ఒక్క ముస్లిం మహిళ కూడా తన భర్తకు ముగ్గురు భార్యలు ఉండాలని కోరుకోదు అన్నారు. సమాజంలో ముస్లిం మహిళలు గౌరవంగా బతకాలంటే ట్రిపుల్ తలాక్ తరహాలో ఉమ్మడి పౌర స్మృతి కూడా తీసుకు రావాల్సిన అవసరం ఉందని, తనను కలిసిన ముస్లిం మహిళలు అందరూ ఉమ్మడి పౌర స్మృతి కావాలని కోరుతున్నారని అస్సాం సీఎం హిమంత పేర్కొన్నారు.

## న్యాయ స్థానాల్లో స్థానిక భాషను ప్రోత్సహించాలి.... మోదీ

స్థానిక భాషలను న్యాయ స్థానాల్లో ప్రోత్సహించడం చాలా ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు తద్వారా న్యాయ ప్రక్రియ తో ప్రజలు అనుసంధానమైనట్లు భావిస్తారని వారిలో విశ్వాసం పెరుగుతుందని అన్నారు. చివరగా న్యాయ ప్రక్రియపై ప్రజల హక్కు బలపడుతుందని అన్నారు. ఇప్పటికే సాంకేతిక విద్యలో స్థానిక భాషలను ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తుల సంయుక్త సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తూ, అండర్ ట్రయల్ కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తులకు సూచించారు. దేశంలో న్యాయ వ్యవస్థ రాజ్యాంగ సంరక్షకుడి పాత్ర వహిస్తుందని, సీఎం లు, సీజే ల సంయుక్త సదస్సు రాజ్యాంగ సౌందర్యానికి నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. నేను చాలా కాలంగా ఈ సదస్సుకు మొదట ముఖ్య మంత్రిగా, ఇప్పుడు ప్రధాన మంత్రి గా హాజరవుతున్నానని, చెప్పాలంటే ఈ సదస్సు విషయంలో నేను సీనియర్ ని అని అన్నారు.

## న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యం --- జస్టిస్ ఎన్ వీ రమణ

దేశంలో న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని, అందుకు మరిన్ని చర్యలు అవసరమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అన్నారు న్యాయ వ్యవస్థలో మౌలిక సదుపాయాలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న ప్రతినిధులను అందరు గౌరవించ వల-

సిందేనని స్పష్టం చేశారు. అంతే కాక కోర్టుల నిర్ణయాలు ఏళ్ల తరబడి అమలు కాకపోవడం వల్లే ప్రభుత్వాల-పై ధిక్కరణ కేసులు పెరుగుతున్నాయని, ప్రభుత్వాల విధి నిర్వహణ వైఫల్యం వల్ల కేసుల సంఖ్య పెరుగుతోం-దని ఢిల్లీలో రాష్ట్రాల సీఎంలు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తు ల సంయుక్త సదస్సులో జస్టిస్ ఎన్ వీ రమణ మాట్లాడుతూ అన్నారు.

అమెరికా చర్యలపై హెచ్చరించిన రష్యా

ఉక్రెయిన్ పై భీకర యుద్ధాన్ని కొనసాగిస్తున్న రష్యాను కట్టడి చేసేందుకు ఆయా దేశాలు ఆంక్షలు విధిస్తున్న సంగతి విదితమే. ఇదే సమయంలో అటువంటి చర్యలకు పాల్పడితే తాము కూడా ప్రతీకార చర్యలకు ఉప-క్రమిస్తామని రష్యా హెచ్చరిస్తోంది. తమ దేశాలకు చెందిన సంపన్నుల ఆస్తులను విక్రయించి, ఆ మొత్తా-న్ని ఉక్రెయిన్ కు ఇవ్వాలంటూ ఈ మధ్య అమెరికా చేసిన ప్రతిపాదనను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. అలా చేస్తే ప్రతి చర్యకు దిగడం న్యాయమేనని రష్యా అంటోంది. శత్రు దేశాల వ్యాపార వేత్తలకు సంబంధించి రష్యాలో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి ఇక వెనుకాడమని స్పష్టం చేసింది.

అమెరికా చర్యలు రష్యా ఆర్థిక వ్యవస్థపై ఎటువంటి ప్రభావం చూపించలేవని .. విహార నౌకలు, విల్లాలతో పాటు ఇతర ఆస్తులు రష్యా అభివృద్ధి కి ఏమీ దోహద పడవని అన్నారు. అయినప్పటికీ శత్రు దేశాలు నాగరిక పద్ధతిలో వ్యవహరించాలని, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని అన్నారు.

ప్రధాని మోదీ విదేశీ పర్యటన

మే 2 వ తేదీ నుండి 3 రోజుల పాటు మూడు దేశాల్లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటిస్తున్నారు. ముందుగా జర్మనీ, అక్కడినుండి డెన్మార్క్ వెళ్లి, తిరుగు ప్రయాణంలో మే 4 న పారిస్ కు చేరుకోనున్నారు. వాణిజ్య వేత్తల-ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రధాని భారతీయులతో సమావేశం కానున్నారు. రష్యా --ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం గురించి మూడు దేశాలతో చర్చించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం డెన్మార్క్ ప్రధాని ఆహ్వానం మేరకు కోపెన్ హగన్ వెళ్లనున్నారు. రెండవ ఇండియా నార్డిక్ సమ్మెట్ లో పాల్గొంటూ , ఈ సదస్సు-కు ఐస్లాండ్, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్ దేశాల ప్రధాన మంత్రులతో చర్చించనున్నారు.

కరోనా విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించిన ప్రధాని మోదీ

కరోనా వైరస్ ఉధృతి తగ్గినట్లు కనిపిస్తున్నప్పటికీ అది ఇంకా అంతరించి పోలేదని, మళ్ళీ పుంజుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కరోనాపై చేస్తున్న పోరులో ఎట్టి పరిస్థితులలోను అలసత్వం వహించవద్దని, రూపాలను మార్చుకుంటున్న మహమ్మారి మళ్ళీ ఎప్పుడు విరుచుకు పడుతుందో ఎప్పటికీ తెలియదన్నారు. ఇటువంటి కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ఇప్పటివరకు 185 కోట్లు వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని ఆయన అన్నారు. అంతేకాదు ఇంకా అమెరికా లాంటి దేశాలలో కూడా ఇంకా కరోనా ఇబ్బంది పెడుతూనే ఉంది.

చైనా లో కొత్తగా బర్డ్ ఫ్లూ అనే కొత్త వేరియంట్ స్టార్ట్ అయ్యింది. ఇప్పటికే కరోనా వల్ల, లాక్ డౌన్ ల వల్ల ఎంతో ఇబ్బంది పడుతున్న చైనా ఈ బర్డ్ ఫ్లూ అక్కడ ఇంకా భయాన్ని రేకెత్తిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభణ అదుపులో ఉన్న-ట్లు కనిపించినప్పటికీ కొత్తగా వెలుగు చూస్తున్న వేరియంట్లు కలవర పెడుతూనే ఉన్నాయి.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోండి. ఎండ తీవ్రతకు, వచ్చే రోహిణి కార్తె ఎండలకు ప్రజలంతా జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది.



సర్వే జనా సుఖినో భవంతు

తీగవరపు శాంతి

# అక్షర మాల



భువనచంద్ర

లోకంలో రకరకాల కుంపట్లు వున్నాయి. ఏ దేశపు కుంపటి డిజైన్ దానిదే. నిజం చెపితే పెద్దలన్నట్లు "ఎవడి కుంపటి వాడిదే". "మీ కుంపటి చాలా చిన్నది... ఉగ్గు గిన్నెల్లో వండాలి... మా కుంపటి అయితేనా.... ఊరవిందు చెయ్యొచ్చు" అంటాడొక ప్రత్యేక మూర్తి. "నా బొంద... ఏ కుంపటయితేనేం. వండాలి అంతే. కుంపటి బంగారపుదని కుంపటిని మింగుతామా?" అంటాడో మామూల్రావు. "అబ్బాయ్... ఇది మామూలు కుంపటి కాదు. గ్రహ చలనాలూ, నక్షత్ర గమనాలూ గుణించి లెక్కలు వేసి సరైన ముహూర్తంలో ప్రారంభించి, సరైన ముహూర్తంలో వెలిగించిన ప్రత్యేక కుంపటి. దీన్ని వాడితే అష్టైశ్వర్యాలూ అడక్కుండానే అమరుతాయి" అన్నాడో ఖగోళ శాస్త్రి. "కుంపటి ఎలా ఉంటేనేం? బొగ్గులు పోసే బిళ్ళ మాత్రం సజావుగా ఉండాలి. లేకపోతే మండే బొగ్గులే కిందకి దిగిపోతాయి. చాలా చాలా రిసెర్చి చేసి కుంపటిబిళ్లని తయారుచేశాము. బస్తీ మే సవాల్" అన్నారో మస్తాన్ సాయిబు.

లోకంలో ఏ రెండు గడియారాలూ ఒకే టైం చూపించవన్నట్లు, ఏ రెండు కుంపట్లు ఒకే వేడినివ్వవు. దేని టెంపరు, టెంపరేచరూ దానిదే. ప్రస్తుతం 'దిక్కుమాలిన పాడు'లో ప్రపంచయుద్ధం జరుగుతోంది. కులకుంపట్లు, మతకుంపట్లు, భాషాకుంపట్లు, వర్గకుంపట్లు, కలిమిలేముల కుంపట్లు, అధికార అనధికార కుంపట్లు, అగ్ర కుంపట్లు, పీడిత బాధిత బడుగు కుంపట్లు, మాజీ కుంపట్లు దేశంలో నిరంతరం ఫటేల్ ఫటేల్ మంటూ లావా చిమ్మే అగ్నిపర్వతం లాగా అంటుకున్నాయి. 'దిక్కుమాలిన పాడు'ని సెగలు పొగలతో నింపేశాయి. అర్జెంటుగా పత్రికా విలేఖరులు, టీవీ ఛానెల్ వెహికిల్స్, అబ్జర్వర్లూ, రాజకీయ విశ్లేషకులూ ఉరుములు మెరుపుల తర్వాత చిటపట చినుకుల్లాగా దిక్కుమాలిన పాడులో దిగిపోయారు. వర్షాకాలంలో బోదురుకప్పల్లాగా దిక్కుమాలిన పాడు జనంతో వాచిపోయింది. అప్పటికప్పుడు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| అ a | ఆ ā | ఇ i | ఈ ī | ఉ u | ఊ ū | ఋ ṛ | ౠ ṝ |
| ఎ e | ఏ ē | ఐ ai | ఒ o | ఓ ō | ఔ au | అం aṃ | అః aḥ |
| క ka | ఖ kha | గ ga | ఘ gha | ఙ ṅa | | | |
| చ ca | ఛ cha | జ ja | ఝ jha | ఞ ña | | | |
| ట ṭa | ఠ ṭha | డ ḍa | ఢ ḍha | ణ ṇa | | | |
| త ta | థ tha | ద da | ధ dha | న na | | | |
| ప pa | ఫ pha | బ ba | భ bha | మ ma | | | |
| య ya | ర ra | ల la | వ va | ళ ḷa | | | |
| శ śa | ష ṣa | స sa | హ ha | ఱ ṟa | | | |

మిర్చిబజ్జీ బళ్ళూ, సోడా బళ్ళూ, పాన్ వాలా బడ్డీలూ, సిగరెట్ బీడీ కౌంటర్లూ వర్షానికి ముందు ఎండాకాలంలో 'ఉసుళ్ళ'లాగా దిగి ఊరిని ఊరించేశాయి. గుళ్ళు, మసీదులూ, చర్చిలూ (మహా కట్టడాలేమీ కాదు.... చిన్నచిన్నవే) జనాలతో నిండిపోయాయి. సునామీ ముంచెత్తినంత వేగంగా జనాల మాటలు దిక్కుమాలిన పాడుని పూర్తిగా ముంచెత్తాయి. అవి మాటలు కూడా కాదు. కేకలు, అరుపులు, వికటాట్టహాసాలూ, క్రోధ ప్రలాపాలూ.

"ఏమిటయ్యా ఇదీ.. కనీవినీ ఎరగని గందరగోళం!" రచ్చబండ మీద కూర్చుంటూ అన్నారు ఎమ్మెల్లే అవధాని గారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎలక్షన్స్ లో అయిదు రోజులకోసారి మాత్రమే అవధానిగారు రచ్చబండకొస్తారు కనక ఆయన్ని ఎమ్మెల్లే అవధాన్లంటారు. అంతేగానీ రాజకీయాలకే ఆయనకీ ఏ సంబంధం లేదు.

"ఏముందండీ... విగ్రహారాధన గురించి కొట్టుకుంటున్నారు. మతం కూడా పక్కన పెట్టి ఇతరుల్లో రుద్దటానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు" నవ్వి అన్నారు గడుసు మాస్టారు.

"ఇష్టంవచ్చినవాళ్లు విగ్రహారాధన చేసుకోవచ్చు.ఇష్టంలేనివాళ్ళు హాయిగా మానుకోవచ్చు. దానికింత రాద్ధాంతం దేనికీ?" అన్నారు ఎమ్మెల్లే అవధాని.

"అంత సింపుల్ అయితే ఎలా? మనం ఎన్నుకున్నవాళ్లనే చూడండి. మైకులు విరగ్గొడతారు. పోడియంలోకి దూసువెళ్తారు. సాధారణ బూతు నుంచి వీర బూతులూ మహాబూతులూ నవ్యాతినవ్య బూతులూ అనూహ్యాబూతులూ తిట్టుకుంటారు. కొండొకచో అంగన్యాసాలూ కరన్యాసాలూ కూడా సమర్ధవంతంగా సమర్పిస్తారు కదా. వీళ్ళల్లోని వారేగా అక్కడికి వెళ్లిందీ? అందుకే అక్కడా ఇక్కడా కూడా ప్రొసీజర్ ని ఫాలో కాకపొతే వ్యవహారం ఓ కొలిక్కి రాదు" నవ్వుతూ అన్నాడు గడుసుమాస్టారు.

రెండురోజులపాటు దిక్కుమాలిన పాడులో మాటలు వర్షాల్లా కురిశాయి. చేతలు నిప్పుల్లా రగిలాయి.మనసులు కర్రముక్కల్లా విరిగాయి. ఆ తరవాత కొంత తుఫాననంతర శాంతి ఏర్పడ్డది.

"ఈ గుళ్ళూ గోపురాలూ పూజలూ వ్రతాలూ అన్నీ హంబక్. జనాన్ని పిచ్చివాళ్ళని చేస్తున్నారు" అన్నది సునీతి.

"ఊఁ... చెప్పండి" తీరిగ్గా అన్నారు గడుసు మాస్టారు. సునీతి పదిరోజుల క్రితం చైనా నించి వచ్చింది. కాసేపు మావోనీ, కాసేపు మార్క్సనీ కాసేపు లైన్ చియాంగ్ పింగ్ నీ ఉదాహరించి పూజలూ వ్రతాలూ చేసేవాళ్లు అత్తగారిని అదరగొట్టింది. అక్కడే ఆగకుండా దిక్కుమాలిన పాడు యువతీ యువకుల్ని తన వాగ్ధాటితో ఆకర్షించి 'No Temple No God' మతాన్ని స్థాపించే కార్యక్రమంలో ఉంది.

"ఓ మై గాడ్ సినిమా హిందీలోనూ, గోపాలా గోపాలా సినిమాని తెలుగులో చూశారుగా! డబ్బుకోసం ప్రొడ్యూసర్లు కాంప్రమైజ్ అయ్యి చివరికి సబ్జక్టుని గోడమీద పిల్లిగా మార్చారేమో. కానీ మేం కాంప్రమైజ్ కాము" దృఢంగా అన్నది సునీతి.

"ఆ సినిమా నేను చూడలేదు కానీ నువ్వు చెప్పాల్సింది చెప్పమ్మా" చల్లగా అన్నారు గడుసు మాస్టారు. ప్రస్తుతం ఊరుఊరంతా రచ్చబండ దగ్గరే వుంది.

"ఎప్పటి రాముడు, ఎప్పటి కృష్ణుడు ఇప్పుడెందుకు వారికి భజనలు చెయ్యడం? ఎందుకా సుప్రభాతాలూ కర్పూర హారతులూ? పేదలకు ఆ ఖర్చుతో బట్టలు కొనిపెట్టొచ్చుగా. గుండ్రాళ్ళకు పాలాభిషేకాలకు బదులు బడిపిల్లలకు పాలు తాగించొచ్చుగా? తరతరాల్నించీ నేటి దీపాలనీ నువ్వులనూనె దీపాలనీ వెలిగించి వెలిగించి టన్నులకొద్దీ నూనెలనీ పాలనీ వృధా పరిచాం. వీటిని నిషేధించాలి. అంతదాకా మేం నిద్రపోము" అన్నది చెకుముకి ఆ పిల్ల అసలు పేరు సుశీల. సునీతి పెట్టిన కొత్త మతంలోకి చేరాక చెకుముకిగా పేరు మార్చుకుంది.

'అయితే ఏం చేద్దామంటారూ? ఒకప్పుడు చైనాలో కూడా అందరూ మావో సూక్తుల్ని మంత్రాలుగా పఠించారుగా. సరే. ప్రస్తుత సమస్య వృధా చేస్తున్న నూనె నెయ్యి పాలు గురించా? విగ్రహారాధన గురించా? విగ్రహారాధన గనక అయితే మీరు నిరభ్యంతరంగా మీ పద్ధతిలో ఉండొచ్చు. విగ్రహారాధన చెయ్యమని మిమ్మల్ని ఎవరూ




బలవంతపెట్టలేదుగా" నవ్వి అన్నారు గడుసు మాస్టారు.

'యువత తప్పుదారి పట్టడం మేం సహించం. అందుకే గుళ్ళని మూసెయ్యండి" ఊగిపోతూ అన్నది సునీతి.

"నీపేరేమిటీ?" అడిగారు మాస్టారు.

"సునీతి. ఏం?" అసహనంగా అన్నది సునీతి.

"నువ్వు చదువుకున్నావా?"

"అదేం ప్రశ్న? నేను సైన్సులో పోస్ట్ గ్రాడ్యుయేట్ ని"

"గుడ్. నువ్వు పుస్తకాలు చాలా చదివేవుంటావుగా!"

"ఆః.. కొన్ని వందల గ్రంథాలు చదివా. అయిదు ప్రసంగ వ్యాసాల్ని కూడా యూనివర్సిటీలో సమర్పించా" గర్వంగా అన్నది.

"గ్రేట్. అన్ని గ్రంథాలు ఎలా చదవగలిగావూ?" నవ్వారు మాస్టారు.

"చదువు నేర్చాను గనక. ఏమిటీ పిచ్చి ప్రశ్నలు?"

"ఎన్ని భాషలు వచ్చు?" అడిగారు మాస్టారు.

"నాకా? తెలుగు ఇంగ్లిష్, హిందీ, జపనీస్, చైనీస్ భాషలొచ్చు" గర్వంగా తల ఎగరేసి అంది.

"శభాష్... అన్ని భాషలు అక్షరాలు లేకుండానే నేర్చుకున్నావా? A అంటే అర్థమేమిటీ? N అంటే అర్థమేమిటీ? T అంటే అర్థమేమిటీ?"

'ఏ అక్షరానికా అక్షరపు అర్థం ఉంటుందా? మేడ్ క్వశ్చన్"

"కాదు. A కి, N కీ, T కీ విడివిడిగా అర్థాలు లేకపోయినా, మూడింటినీ కలిపితే ANT అంటే చీమ అని అర్థం వస్తుంది. అక్షరాలు భాషకి ఎలా ముఖ్యమో, భారతీయ ఆధ్యాత్మికతకు ఆలోచన అంత ముఖ్యం. మనసుకి ఏకాగ్రత నేర్పే సాధనే విగ్రహారాధన. వ్రతాలూ పూజలూ అనేవి అక్షరమాల లాంటివి. అంతెందుకూ నిన్ను గుర్తించాలంటే ఏదో ఓ పేరు పెట్టాలిగా. కనీసం x అని గణితశాస్త్రంలో అన్నట్టుగా ఏదో ఓ పేరో గుర్తో ఉండాలిగా. అలాగే నిరాకార తత్వాన్ని తెలుసుకోవడానికి 'సాకారా'ల్ని మెట్టుగా వాడతాం. విగ్రహారాధన అనే సగుణపూజతో మొదలై మనోపూజతో ఎదిగి, నిర్గుణత్వాన్ని సిద్ధింప చేసుకోవడమే మన మహామహులైన మహర్షులు ఋషులు మనకి తెలిపిన మార్గం. ఏ జ్ఞానమైనా, ఏ శాస్త్రమైనా, ఏ ఆలోచనైనా ఒక పునాది మీదే ఆధారపడివుంటుంది. విగ్రహారాధన కంటికి కనిపించని దాన్ని కనుగునే ప్రయత్నానికి వేసిన పునాది మాత్రమే. ఆ పునాది మీద ఎవరికివారు నిర్మించుకునేదే ఆధ్యాత్మిక సౌధం. సునీతీ, 'No Temple No God' మతం కూడా నూతనమేమీ కాదు. Gods & Temples అన్నంత పురాతనమైనది. నీకు ఆవేశం వుంది. ఆ ఆవేశాన్ని కొండమీద కురిసిన నీటిలా వ్యర్థం చెయ్యకు. ముందు తెలుసుకునే ప్రయత్నం చెయ్యి. నీ ఆలోచన నీకెంత గొప్పో ఇతరుల ఆలోచనా అంతే గొప్పదిగా! మళ్ళీ తీరిగ్గా ఆలోచించు. అప్పుడు మళ్ళీ చర్చిద్దాం" అన్నారు మాస్టారు.

మళ్ళీ కలుద్దాం. - మీ భువనచంద్ర

# పూరి జగన్నాథ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమై నది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్మ్యాన్ని యథామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

## 36.వ అధ్యాయం

### ( చాతుర్మాస దీక్ష)

ఆషాడ మాసంలో కర్కాటకంలో సూర్యుడు ప్రవేశించినప్పుడు స్వామి నిద్రిస్తారు.కార్తీక మాసంవరకు స్వామి నిద్రలో ఉంటారు.ఈ సమయంలో స్వామిని ఆరాధించుట పుణ్యప్రదమైన కాలము.

ఈ నాలుగు నెలలు చాతుర్మాస్య దీక్ష వహించి, సన్నిధిలో ఉన్నట్లయితే అశ్వమేధ యాగం చేసిన ఫలితం కలుగుతుంది.సముద్రస్నానంచేసి,స్వామిని దర్శించుకున్నచోఎటువంటిదుఃఖాలుకలుగవు. చాతుర్మాసంలో స్వామి సన్నిధిలో ఉండి,స్వామిని దర్శిస్తే మోక్షం లభిస్తుంది.

శ్రౌత,స్మార్త కర్మలు అన్ని విడిచిపెట్టి స్వామి సన్నిధిలో ఉండాలి.స్వామి వైకుంఠాన్ని విడిచిపెట్టి ఈ నాలుగు మాసాలు ఇక్కడే ఉంటాడు.ఆసమయంలో స్వామిని దర్శించిన వారికి మోక్షం కలుగుతుంది. మిగిలిన ఎనిమిది మాసాలు ఇక్కడ నివసిస్తే ఎంతఫలితం కలుగుతుందో అంతే ఫలము ఈ నాలుగు



మాసాలు ఇక్కడ నివసిస్తే కలుగుతుంది.( 1 -11 )

అన్ని పుణ్యక్షేత్రాలలో నివసిస్తే ఎంతటి పుణ్యం కలుగుతుందో అంతటి పుణ్యం చాతుర్మాస్యంలో ఉంటే కలుగుతుంది.ఆచారభ్రష్టుడు,కులభ్రష్టుడు ఇక్కడఉంటే పాపాలన్ని నశిస్తాయి.నరసింహుని అనుగ్రహం వలన వైకుంఠ నివాసం కలుగుతుంది.అన్ని కర్మలు విడిచి పెట్టి స్వామియందు దృష్టి పెట్టి ఈ క్షేత్రంలో నివసించాలి

ఆషాడ శుక్ల ఏకాదశి రోజున స్వామి వారికి శయనోత్సవం నిర్వహించాలి.స్వామిని శయనాగారం ఉంచాలి.రత్నాల పల్లకి స్వామికి ఎదురుగా ఉంచాలి.శయనాగారంలో కర్పూర ధూపం వేయాలి. చలువరాతి పలకలు వేయాలి.రంధ్రాలు లేకుండా గదిని మూసి ఉంచాలి.గంధంచల్లాలి.

గదిని చిత్రములతో అలంకరించాలి.రాత్రియందు మూడు దేవతా మూర్తులను తీసుకొని రావాలి. విగ్రహాలను బంగారంతోకాని,వెండితోకాని, రాగితో కాని చేయాలి.ఆ మూర్తులను స్వామి పాదాల దగ్గర ఉంచి పూజించాలి. ( 12 - 23 )

" లోకాలకు జీవమునిచ్చువాడా!శుభములు ఇచ్చువాడా! ఇక్కడకు వచ్చినిద్రించు" అని ప్రార్థించాలి.విగ్రహాలపై ఉన్న పూలదండలు తీసివేసి,అర్చా మూర్తులపై ఉంచాలి.సంగీతముతో ద్వారందగ్గరకు వచ్చేయాలి.

మూడు ఘడియల కాలంలో పంచామృతాలతో స్నానం చేయించాలి.గంధాదులు అద్దాలి.వస్త్రాలతో అలంకరించాలి."ఓ జగన్నాథా! జగద్వంద్యా1జగత్రాణ



పరాయణా! వర్షాకాలం మూడు నెలలు ఇక్కడ విశ్రాంతి తీసుకో.అరిష్టాలను పోగొట్టు" అని ప్రార్ధించాలి.తరువాత స్వామి పడకగదిని మూసివేయాలి.

ఈ విధంగా స్వామిని నిదురపుచ్చినట్లయితే సర్వ సుఖాలను పొందవచ్చు.ఈ సమయంలోఅనేక రకాలయిన వ్రతాలు చేయాలి.ఈ నాలుగు నెలలు మంచంపై పడుకోకూడదు.ఇతరుల ఇంట్లో భోజనం చేయ కూడదు.పొట్ల, ముల్లంగి,వంకాయ తినకూడదు. అలసందలు మొదలయిన చిరుధాన్యాలు విడిచి పెట్టాలి.కూరలు,పాలు,పెరుగు,మినుములు క్రమంగా విడిచి పెట్టాలి. పాదుకలు వాడకూడదు. ఆషాడంలో చాతుర్మాస దీక్ష తీసుకోవడానికి వీలుకానప్పుడు, కార్తీక మాసంలో వ్రత దీక్ష తీసుకోవచ్చు.





ఓ హరీ!కృష్ణా! కేశవా!నారసింహా!విష్ణూ!నీకు నమస్కారం." అని స్వామిని ప్రార్థించాలి ఈ విధంగా చేసినట్లయిన పాపాలు గడ్డిపోచలా కాలిపోతాయి.ఒక పూట మాత్రమే భోజనంచేస్తూ,స్వామి ప్రసాదాన్ని స్వీకరిస్తూ చాతుర్మాస్య దీక్ష చేయాలి.అబద్ధాలు ఆడకూడదు.ఆషాడ శుక్ల ఏకాదశి రోజునకాని, కర్కాటక సంక్రమణం రోజునకాని ఈ వ్రతాన్ని ప్రారంభించాలి.స్వామి ఎదుట వ్రతాన్ని స్వీకరించి,అర్చన,జపం, చేయాలి. చేతులు జోడించి,స్వామికి నమస్కరించి, ఓ! స్వామి! నీ అనుగ్రహం వలన ఈ వ్రతాన్ని స్వీకరించాను.నిర్విఘ్నంగా,సంపూర్ణంగా పూర్తి అగునట్లు చూడు.ఈ వ్రతం పూర్తిఅయితే పరలోకం ప్రాప్తించునట్లు చూడు' అని ప్రార్థించాలి.స్వామిపై మనస్సు పెట్టి వ్రతాన్ని చేయాలి. ఈ నాలుగు నెలలు స్వామిని పూజించి, బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి.అలా చేయలేకపోతే కార్తీక మాసం చివరలో పారణ చేయాలి.పారణ సమయంలో,స్వామిని పూజించి,అగ్నికి ఆహుతి ఇవ్వాలి.బ్రాహ్మణులకు భోజనం పెట్టాకి (24 - 50)

పైనచెప్పినట్లు వ్రతం చేయలేనివారు,చివరి రోజున వ్రతం చేయవచ్చు.కృచ్చ, చాంద్రాయణాది వ్రతాలు చేయవచ్చు. అవి కుదరకపోతే,పాలుతాగుతూ శాకా ఆహారాన్ని తీసుకొని వ్రతాన్ని చేయవచ్చు.లేదా భీష్మ పంచమిరోజున వన్య వృత్తిని స్వీకరిచ వచ్చు.

భగవద్భక్తి లేనివారికి ఈ వ్రతాలగూర్చి చెప్ప కూడదు.తీర్థయాత్రలు,దానాలు చేయుటవలన ఎటువంటి ఫలితం కలుగుతుందో అటువంటి ఫలితము విష్ణు భక్తివలన లభిస్తుంది.శయనోత్సవాన్ని చూసి, చాతుర్మాస దీక్ష చేసిన వారికి పునర్జన్మ ఉండదు. శాశ్వత బ్రహ్మలోకం లభిస్తుంది.

**స్కాంద పురాణంలోని,వైష్ణవ ఖండంలోని,పురుషోత్తమక్షేత్ర మాహాత్మ్యంలో శయనోత్సవం అను ముప్పయ్ఆరవ అధ్యాయం సమాప్తం.**

# మాతృదేవోభవ

నిర్మల

మాతృత్వం అనేది ఓ తీయ్యని అనుభూతి. తల్లి కావడంలో ఓ అందమైన అనుభవం. తల్లి అనిపించుకోవడంలో ఎంతో ఆనందం, దానితో పాటు మరెన్నో బాధ్యతలు కూడా అల్లుకుని ఉంటాయి. అటువంటి ఆత్మీయానురాగంతో కూడుకున్న అమ్మతనంలోని మాధుర్యాన్ని గురించి ఎంత చెప్పినా ఇంకా చెప్పాల్సింది ఉంటూనే ఉంటుంది. ప్రతి సంవత్సరం మే నెలలో వచ్చే రెండవ ఆదివారాన్ని 'మదర్స్ డే'గా జరుపుకుంటున్నాం.

'అమ్మ' అనే మాటలోని కమ్మదనం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆ పద ఉచ్చారణలోనే మన మదిలో ఉద్విగ్నత, ప్రేమభావం ఉప్పొంగుతాయి. ఈ ప్రపంచంలోకి రాకముందు తల్లి గర్భమే మన నివాసం. తొమ్మిది నెలలపాటు మానవుడు తల్లి గర్భంలో ప్రాణం పోసుకుని జీవించడానికి అవసరమైన మేధ, అవయవాలు పెంపొందించుకుంటాడు. ఈ ప్రక్రియలోని పవిత్రత పరమాత్మ సమానమైనది. జన్మించిన తరువాత తండ్రి పరిచయం అవుతాడు. ఇదిగాక ఆచార్యుడు (గురువు) పరిచయం అవుతాడు. మనిషి తల్లిలోని శరీరాంతర్భాగమై ఎదిగి అమ్మలోని కమ్మదనాన్ని ఆస్వాదిస్తాడు. కనుకనే ఆచార్యుని కన్నా, తండ్రికన్నా, తల్లి స్థానం మూలమైంది. ఈ భూమిపై మనుగడ సాగించడానికి అమ్మ తన బిడ్డకు అర్హత కలిగిస్తుంది. ఈ శరీరం ద్వారా ఇహలోకంలోనూ, పరంలోనూ ఏది సాధించినా - మనిషి ప్రాతిపదిక తల్లి.



ధర్మ శాస్త్రాల్లో తల్లి పాత్ర చాలా ప్రధానమైనది. ప్రశంసనీయమైనది. ఆమెలోని విశిష్టమైన ఉదాత్త భావాలు సంతానానికి వస్తాయి. అయితే శాస్త్రకారులు తల్లిని విదుషీమణి. త్యాగమయి అనురాగమయి కావాలన్నారు.

ప్రేమమయిని, స్నేహితురాలిని, శ్రేయోభిలాషిణిని ఆహార ప్రదాతను రక్షకురాలిని, మీదుమిక్కిలి జ్ఞానదాతను ఒకే మూసలో పోసి దేవుడు కరుణాతిశయంతో మనిషికి సమర్పించిన అపురూపమైన వరం తల్లి. సంతానాన్ని నిర్మించే శక్తిని పరమాత్ముడు తల్లికి వరంగా ప్రసాదించాడు. తల్లి తన బిడ్డలకు సత్యమైన ఉపదేశమే ఇస్తుంది. తల్లినుంచి సంతానానికి లభించే ఉపదేశం, ఉపకారం మరెవరి వల్లనా లభించదు. తల్లి

చూపే ప్రేమ మమకారం హితం మరెవరూ చూపరు.

అమ్మ ఎంత మంచిదంటే అందరి బాధలకి నివారణోపాయంగా ఉండే తను తనకి ఒంటి బాధ ఏమైనా వస్తే పిల్లల చేత చేయించుకోడానికి ఇష్టపడదు. అయితే పచ్చి నిజం ఒకటి అమ్మ తన పిల్లలనందరినీ ఒకే విధంగా ఒకే ఇష్టంతో సమానంగా పెంచినా ఆ పిల్లలందరూ అమ్మను ఒకే ఇష్టంతో చూడరు. ఎంత ఘోరం! మాతృత్వానికి ప్రత్యామ్నాయం మరొకటి లేదు. కుటుంబ వాతావరణంలో అమ్మదే కీలకస్థానం. బాధ్యతాయుతంగా పిల్లల్ని పెంచడం అనేది ఎంతో త్యాగంతో కూడుకున్నది. దానికి విలువ కట్టలేం. పిల్లల పెంపకంలో కామాలు ఫుల్ స్టాప్ లూ లేవు.

వారు ఏ వయసుకు ఎదిగినా అమ్మకు మాత్రం పిల్లలే. తల్లికి మించిన ఆత్మీయురాలు పిల్లలకు ఉండదు. తన పాలతో ఆరోగ్యం, ఆలోచనలతో, చేతలతో మానవత్వం, ప్రేమ కరుణలను ఆ తల్లి అందిస్తుంది.

ఆమె అద్భుతమైన శక్తి. ఆ శక్తిని పరమాత్ముడు మానవనిర్మాణం కోసం సమాజానికి అర్పించాడు. ఆమె భగవంతుడు పంపగా వచ్చిన దేవత. ఆ దేవత తన సంతోషాలను బిడ్డలకోసం త్యాగం చేస్తుంది. ఆ తల్లిని అర్థం చేసుకుని ఆమెను మనః శాంతిగా ఉంచడం బిడ్డల ధర్మమని నీతిశాస్త్ర కోవిదులన్నారు. త్రికరణ శుద్ధిగా తల్లిని సేవించి సత్కరించడమే పూజించడం. తల్లి విలువ తెలుసుకుని ఆమె మనసుకు బాధ లేకుండా ఎప్పుడూ సంతోషంగా ఉండేటట్లుగా చూసుకోవడమే మన ధర్మం.

భక్తులకోసం భగవంతుడు ఎత్తిన అవతారాలు పదే. పిల్లలకోసం తల్లి ఎత్తే అవతారాలు కోకొల్లలు. బిడ్డకు అమ్మ నడిచే ఓ భగవద్గీత, ఓ బైబిల్, ఓ ఖురాన్. లోకంలోని నవరత్నాలు, మణిమాణిక్యాల పోగు ఒకవైపు - పేగుబంధాన్ని ఇంకోవైపు ఉంచి ఒక దాన్నే ఎంచుకోమంటే ఏ తల్లయినా మొగ్గు చూపేది తన కడుపుపంట వైపే. ఏటికేడు ప్రపంచ వింతలూ మారిపోవచ్చేమో కానీ తల్లి ప్రేమ మాత్రం సృష్టి ఉన్నంతవరకూ చెక్కు చెదరకుండా సాగే అద్భుతం.

'అమ్మ' అన్నది ఒక కమ్మని మాట, అది ఎన్నెన్నో జన్మల తరగనిమూట' అన్నాడో కవి. ఈ పాటలో ప్రతి అక్షరమూ అమ్మ ప్రేమను చాటిచెప్పేదే. వాస్తవంలోనూ సృష్టిలోని ఇతర బంధాల కంటే అపురూపమైనది. నిష్కల్మషమైనది. ప్రలోభాలకు లొంగనిది తల్లీబిడ్డల అనుబంధమే. తల్లిప్రేమలో ఎంతయినా చోటు దొరుకుతుంది. కానీ లోటుండదు. బిడ్డ ఉన్నతికి దీటుగా పెరుగుతుందే తప్ప ఈర్ష్యాసూయలు దరి చేరనివ్వదు.

వేదం కూడా మాతృదేవో భవ అంటూ తల్లికే ప్రథమ స్థానాన్ని ఇచ్చింది. మనం ఆమె గర్భంలో ఉన్నప్పుడు మనకు ఏ రుచి కావాల్సి ఉందో ఆ రుచిని అడిగితే తనకి ఆ రుచి అసహజమైనా పుట్టబోయే మనకోసం తానూ తిని తన ప్రాణాల్ని పణంగా పెట్టి ఎంతో కష్టంతో నొప్పుల్ని భరించి ఇష్టంగా కన్నది అమ్మ.

మనకి మొదటిలో అమ్మ బడి. మొదటి పాఠం- ఒకరి కళ్ళలోకి ఒకరు చెప్పలేని ఆనందంతో మౌనంగా చూసుకోవడం. రెండవ పాఠం- అమ్మ ముక్కుని తన బిడ్డ ముక్కుతో ఒత్తుతూ పెట్టుకునే ముక్కు ముద్దు. మూడవ పాఠం ఆటలు- 'తారంగం తారంగం వేణునాథా తారంగం'. నాల్గో పాఠం - పరిశుభ్రత- కాలకృత్యాలని అసహ్యం అనుకోకుండా శుభ్రం చేయడం. ఇక ఆరో పాఠం ప్రకృతి పరిచయం - చందమామ

రావే, నాన్న ఇదిగో, అమ్మమ్మ ఇదిగో, అక్క ఇదిగో ఇలా. ఇక బడి పూర్తిగా అయిపోయాక చక్కని పాటను జో అచ్యుతానంద జో జో ముకుందా అని పాడుతూ వీపు మీద అభయాన్ని సూచిస్తూ అరచేత్తో తట్టి నిద్రపోయేలా చేయడం-పరోక్షంగా సంగీతాన్ని విని తన్మయత్వాన్ని తెచ్చుకోవచ్చుననే విషయం ఆ పసిపాపకు నేర్పడం గర్భాన్ని ధరించింది మొదలు బిడ్డలు పూర్ణ విద్వాంసులయ్యేవరకు సుశీలతను బోధించే తల్లి ఎంతో ధన్యురాలు అని మహర్షి దయానంద సరస్వతులవారు అన్నారు. భారతీయ సమాజంలో తల్లి పాత్ర అద్వితీయమైనది.

సంతానానికి సభ్యత సంస్కారం తల్లి ద్వారానే కలుగుతాయి. ఏవిధమైన చెడుపనులు చేయకుండా తల్లి శిక్షణ ఇస్తుంది. చిన్నలతో పెద్దలతో తల్లితో తండ్రితో అధికారులతో ఎట్లా మాట్లాడాలో తల్లి నేర్పిస్తుంది.

అమ్మ కథ రాయటమంటే చేయి తిరిగిన రచయిత కానక్కరలేదు. మన కన్నకొడుకో కూతురో అయితే చాలు. అమ్మను తలుచుకుంటే చాలు -అద్భుతాలు జరిగిపోతాయి. ఆమె జీవితాన్ని మించిన గొప్ప కథేం వుంటుందీ? ఎక్కడో నాన్న, ఇక్కడ గంపెడు పిల్లలతో అమ్మ. తినడానికి మూడు రొట్టెలు. తినదలచినవారు నలుగురు. 'నాకు అక్కరలేదురా' అనడం ఆమెకు కొత్తకాదు. 'ఎందుకో దాహమేస్తున్నదమ్మా' అంటూ పడుకునేముందు రెండు చెంబుల నీళ్లు గలగలా త్రాగడం ఆమెకు కొత్తకాదు.

ఫస్ట్ క్లాసు మార్కులు, పెద్ద కాలేజీలో సీటు, ఫీజు కట్టడానికి డబ్బుండదు. హఠాత్తుగా అమ్మచేతి బంగారు గాజులు మాయమవుతాయి. బంగారుకొండ సంతోషంగా బస్సెక్కుతాడు. మట్టిగాజులు నవ్వుతూ వీడ్కోలు చెబుతాయి.

పిల్లలు చిన్నప్పటినుంచీ ఇలా ఒకరకమైన పొజెసివ్ నెస్ తో వాళ్ళను పెంచి వాళ్లతోడిదే లోకమన్నట్లుగా తనకంటూ సొంత ప్రపంచాన్ని మిగుల్చుకోకుండా బతికే తల్లిదండ్రులు, పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత తమను నిర్లక్ష్యం చేసి వృద్ధాశ్రమాల్లో చేర్పించడం లాంటిది చేసినపుడు దానిని తట్టుకోలేకపోతున్నారు. తమ వృద్ధాప్యంలో పిల్లల అండదండలు ఉంటాయనుకుంటున్నవారి ఆశలు ఆవిరైపోతున్నాయి. నిరాదరణకు లోనౌతున్నారు. ముసలితనంలో తిండిపెట్టేవారే కరువవుతున్నారు. ఎంత ఘోరం??

మన వర్ధమాన కవుల రచనలు అమ్మను ఎంతగానో శ్లాఘిస్తున్నాయి. వారి ప్రకారం అమ్మంటే-

-మాతృత్వం కూడా ఓ ఉద్యోగమైతే ప్రపంచంలో అత్యధిక జీతం అమ్మకే ఇవ్వాలి.

- దేవుడు సర్వాంతర్యామి అనడానికి ఒక్కటే సాక్ష్యం - సృష్టి లోని ప్రతి జీవికి అమ్మ ఉంది.

- జీవితాన్ని వరంగా ఇచ్చిన అమ్మకు ఏ బహుమతి ఇచ్చినా తక్కువే.

- అమ్మ ఏ విషయమైనా రెండుసార్లు ఆలోచిస్తుంది. ఒకసారి తనవైపు నుంచి, మరోసారి బిడ్డవైపు నుంచి

- చిన్నప్పుడు చలికి వణికిపోతుంటే వెచ్చని దుప్పటి కప్పి కాపాడుతుంది. పెద్దయ్యాక సమస్యలతో సతమతం అవుతుంటే ప్రార్థనతో కాపాడుతుంది అమ్మ

- అమ్మ ముద్దుల వెనకే కాదు, దెబ్బల వెనుక కూడా అపారమైన ప్రేమ వుంది. 'అమ్మా, మళ్ళీ వందసార్లు నీ కడుపులోనే పుట్టినా తీరుతుందా నీ ఋణం- లక్షరెట్లు పెరుగుతుంది కానీ.

# గ్రీసు దేశపు పురాణ గాథలు




## వేమూరి వేంకటేశ్వరరావు


**"Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence."**
**Aldus Huxley. "Knowledge and Understanding"**

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి," అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.

పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అని-పించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.

ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 17. రాజుగారివి గాడిద చెవులు




బొమ్మ. మైదస్ కూతురిని తాకడం (వికీపీడియా)


నేను చిన్నప్పుడు పత్రికలలో (చందమామ, బాల, బాలమిత్ర) చదివిన కథలన్నిటిలోను నాకు స్పష్టంగా జ్ఞాపకం ఉన్న కథలలో "రాజుగారివి గాడిద చెవులు" కథ అంటే అది అతిశయోక్తి అవదు. ఇది గ్రీకు పురాణకథలలో ఒకటన్న విషయం నాకు ఈనాడే తెలిసింది!

## 17.1 పట్టినదల్లా బంగారం

గ్రీకు పురాణకథలలో పేరెన్నికగన్న కథ ఫ్రిగియా (Phrygia) అనే రాజ్యానికి రాజు అయిన మైదస్ (Midas) కథ. గ్రీకు పురాణకథా చక్రాలలో మైదస్ గురించి రెండు విభిన్నమైన కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఓవిడ్ (Ovid) రాసిన మెటమార్ఫసిస్ (Metamorphosis) లో మైదస్ గురించిన కథలు మనకి కనిపిస్తాయి. ఆ రెండు కథలు ఇక్కడ చెబుతాను.

గ్రీకు పురాణకథలలో కనిపించే సేటర్ (satyr) అనేది ఒక నరాశ్వం - అనగా కొంత భాగం మనిషి రూపం, కొంత భాగం గుర్రం రూపం. ఇలాంటి స్వరూపాలనే మన పురాణాలలో కిన్నరులు (అశ్వ ముఖము, నర శరీరము కలవారు), కింపురుషులు (నర ముఖము, అశ్వ శరీరము కలవారు) అని వర్ణించేరు. సిలెనస్ (Silenus) అనే పేరు గల ఒక నరాశ్వం గ్రీకు దేవుడు డయొనీసస్ (Dionysus) సహచర్యంలో కనబడుతూ ఉంటాడు. ఒక రోజు సిలెనస్ తప్ప తాగేసి రాజుగారి తోటలో పడిపోతాడు. రాజభటులు అతనిని రాజు దగ్గరకి తీసుకెళతారు. మైదస్ సిలెనస్ ని గుర్తుపట్టి పది రోజులపాటు సపర్యలు చేస్తాడు. మైదస్ చేసిన సహాయానికి ముగ్ధుడైన డయొనీసస్ ప్రతిఫలంగా మైదస్ ని ఒక వరం కోరుకోమని చెబుతాడు. దూరాలోచన లేకుండా తాను పట్టిందల్లా బంగారం అయిపోవాలి అని కోరుకుంటాడు మైదస్.

ఇక్కడ నుండి కథని ఎవరికి నచ్చిన విధంగా వారు నడిపించవచ్చు. నథేనియల్ హాతోరన్ (Nathaniel Hawthorne) చెప్పిన కథలో, మైదస్ స్పర్శ వల్ల ఉద్యానవనంలో గులాబీలు పరిమళం లేని పసిడి పువ్వులుగా మారిపోయాయని, అందువల్ల మైదస్ కూతురు ఏడిచిందని, ఏడుస్తున్న కూతురుని సముదాయించడానికి మైదస్ ఆమెని చేరదీసే సరికి ఆ అమ్మాయి బంగారు విగ్రహంగా మారిపోయిందని ఉంది. మరొక కథనంలో పళ్లెంలో ఉన్న భోజన పదార్థాలు ముట్టుకునేసరికల్లా భోజనం బంగారం అయిపోతుంది . మైదస్ ఆకలితో అలమటించి పోతాడు. కారణం ఏదయినా చేసిన తప్పు తెలుసుకుని మైదస్




పశ్చాత్తాపం పడతాడు. డయొనీసస్ కనికరించి పాక్టోలస్ నదిలో గ్రుంకులిడితే వరం యొక్క ప్రభావం సడలి పోతుందని ఉపశమన మార్గం చెబుతాడు. (ఈ నది టర్కీలోని సార్డిస్ దగ్గర ఉంది.) మైదస్ ఆ నదిలో మునిగేసరికల్లా ఆ వరం యొక్క ప్రభావం మైదస్ నుండి నదిలోని నీళ్ళల్లోకి వెళ్ళిపోతుంది. ఇప్పటికీ ఆ నదిలోని ఒండ్రుమట్టిలో బంగారం నలుసులు కనబడుతూ ఉండడానికి కారణం ఆనాటి మైదస్ స్పర్శే అని ప్రజలలో ఒక నమ్మకం ఉంది.

17.2 రాజుగారివి గాడిద చెవులు

మైదస్ కి సంబంధించిన కథ మరొకటి ఉంది. సువర్ణ స్పర్శ వల్ల జరిగిన పరాభవానికి ఒకింత చింతించి మైదస్ కోటగోడలు దాటి బయట ఉన్న పచ్చిక బయళ్లలో తిరుగుతూ ఉంటాడు. అడవులకి, కొండలకి, పచ్చిక బయళ్ళకి, అధినేత అయిన పేన్ (Pan) అనే ఒక నరమేషం వాయిస్తున్న పిల్లనగ్రోవి సంగీతానికి మైదస్ ముగ్ధుడు అవుతాడు.

ఒకసారి అపాలో కి పేన్ కి మధ్య సంగీత పోటీ జరుగుతుంది. ఈ పోటీలో గెలుపెవరిదో నిశ్చయించడానికి నియమించబడ్డ నిర్ణేతగణంలో మైదస్ ఒక నిర్ణేత. మిగిలిన నిర్ణేతలంతా అపాలో సంగితమే గొప్పగా ఉందంటే మైదస్ మాత్రం వ్యతిరేకంగా పేన్ ని సమర్ధించడంతో అపాలోకి కోపం వచ్చింది. “సంగీత జ్ఞానం లేని మైదస్ చెవులు గాడిద చెవులులా మారిపోవాలి” అని శపిస్తాడు. ఇంకేముంది. మైదస్ కి మామూలు చెవుల స్థానంలో గాడిద చెవులు వస్తాయి. ఎంత అప్రతిష్ట! ప్రజలకి తెలిస్తే పరువు గంగలో కలసిపోతుంది కదా! మైదస్ తలపాగా ధరించడం మొదలు పెట్టేడు. ఎంత రాజైనా తలకాయని మంగలి చేతులలో పడకుండా దాచలేడు కదా. రా-




జుగారివి గాడిద చెవులు అని మంగలికి తెలిసిపోయింది. మూడో కంటివాడికి ఈ రహశ్యం తెలిసిందంటే తల తీయించేస్తానని మైదస్ మంగలిని బెదిరించేడు. రాచ రహశ్యం! రచ్చకెక్కితే కొంపలంటుకుపోవూ? కడుపులో దాచుకోలేక మంగలి కడుపు ఉబ్బి పోతోంది. ఏమిటి చేస్తాడు? ఏమిటి చెయ్యగలడు? ఎవ్వరికో ఒకరికి చెప్పాలి. తనకి తెలిసిన రహశ్యాన్ని ఒక పుట్టలో ఊదేశాడు!

కొన్నాళ్ళకి ఆ పుట్ట మీద వెదురు బొంగులు పెరగడం మొదలెట్టేయి. అవి గాలికి ఇటు అటూ ఊగినప్పుడల్లా, పిల్లనగ్రోవిలో గాలి ఆడినట్లు అయి, అవి “రాజు





గారివి గాడిద చెవులు" అని పాట ప్రసారం చెయ్యడం మొదలెట్టేయి!

ఇంతకీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మైదస్ అనే రాజు నిజంగా 3000 సంవత్సరాల క్రితం (అనగా, సు సా. శ. పూ. 800 లో) ఫ్రిగియా (Phrygia) అనే రాజ్యాన్ని పరిపాలించేడనడానికి ఆధారాలు ఉన్నాయి. ఈ ఫ్రిగియా రాజ్యం ప్రస్తుతం టర్కీ ఉన్న ప్రదేశంలో ఉండేది. ఇటీవల, అనగా సా. శ. 1957 లో, పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం వారు గోర్డియన్ (Gordion) లో జరిపిన తవ్వకాలలో మైదస్ తండ్రి గోర్డియోస్ (Gordios) యొక్క శ్మశానవాటిక కనబడింది. అక్కడ శవపేటికలో కనిపించిన అస్థిపంజరం, దానిచుట్టూ ఉత్తరక్రియలకి సంబంధించిన విందుభోజన సామాగ్రి కనిపించేయిట.

మరయితే మైదస్ పట్టినవన్నీ నిజంగా బంగారం అయిపోయేవా? ఆనాటి దుస్తుల్ని విశ్లేషించి చూస్తే వాటన్నిటికీ ఎరుపు డౌలు ఉండడాన్ని బట్టి అవి మూడొంతులు అయోభస్మం (తుప్పు లేదా oxide of iron) రంగు అయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆ రంగుని చూసి బంగారం అనుకుని ఆ కథ సృష్టించి ఉండవచ్చు. మరి గాడిద చెవుల మాట? ఈ సంశయాన్ని తీర్చటానికి ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానం సరిపోదు.

బొమ్మ. Jean-Fran  ois Godefroy చిత్రించిన "అలెగ్జాండర్ గోర్డియన్ బ్రహ్మముడిని ఛేదించడం" (వికీపీడియా)



### 17.3 అలెగ్జాండర్ గోర్డియన్ బ్రహ్మముడిని ఛేదించడం

ఈ కథ ముగించేలోగా మైదస్ తండ్రి గోర్డియన్ గురించి చిన్న పిట్టకథ ఒకటి అప్రస్తుతం కాదు. ఫ్రిగియా రాజ్యానికి ఒకప్పుడు రాజు లేకుండా అయిపోయింది. అప్పుడు టెల్మిసస్ (Telmissus) లో ఉన్న ఓరకిల్, "రాజ్యంలోకి ఎవరైతే మొట్టమొదట ఎడ్లబండిని తోలుకుంటూ వస్తారో వారే ఫ్రిగియా రాజ్యానికి రాజు" అని జోస్యం చెప్పింది. గోర్డియన్ అనే పేరు గల ఒక రైతు ఎడ్లబండిని తోలుకుంటూ ఊళ్లోకి రాగానే అతనికి పట్టాభిషేకం చేసేసేరు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకి కృతజ్ఞతగా మైదస్ ఆ బండిని ఆ ఓరకిల్ ఆలయంలో ఒక స్తంభానికి పెద్ద మోకుతో గట్టిగా ముడివేసి కట్టేసేడు. ముడి మీద ముడివేసి ఎంత గట్టిగా కట్టేడంటే దానిని విప్పడానికి ఎవ్వరి తరము కాలేదు. నాలుగు వందల సంవత్సరాల తరువాత, సుమారు సా. శ. పూ. 400 లో, అలెగ్జాండర్ ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు ఆ బ్రహ్మముడి ఇంకా అలానే ఉందిట. ఆ ముడి ఎవ్వరు విప్పుతారో ఆ వ్యక్తి ఆసియా అంతటికి సార్వభౌముడు అవుతాడని అక్కడ ఓరకిల్ జోశ్యం చెప్పిందిట. ఈ మాట విని అలెగ్జాండర్ ఆ ముడిని విప్పడానికి ప్రయత్నించి మొదట విఫలం అవుతాడుట. అప్పుడు "ముడి విప్పడం ముఖ్యం కానీ ఎలా విప్పేమన్నది ప్రధానం కాదు" అంటూ తన కరవాలం తీసుకుని ఒక్క వేటులో ఆ ముడిని రెండు ముక్కలు చేసి విప్పేడుట. ఎప్పటికీ పరిష్కారం దొరకకుండా ఏళ్ల తరబడి వేధిస్తున్న సమశ్యని ఎవరైనా ఒక్క వేటులో పరిష్కరిస్తే "గోర్డియన్ ముడిని విప్పినట్లు" (untying the Gordian knot) అనే నుడికారాన్ని వాడతారు.

(ఇంకా వుంది)

# 'వైవిధ్య భరిత యాత్రాస్థలి సింహళమ్'




ఆచార్య మత్స్యరాజ హరగోపాల్

పదకొండురోజులపాటు సింహళదేశంలో (శ్రీలంక) యాత్ర వైవిధ్యభరితంగా సాగింది. పర్వతాలు, గుహలు, ప్రాచీన కాలం నాటి ఖిల్లాలు (Forts) ఆలయాలు సముద్రతీరం ఇలా ఎన్నింటినో చూశాం.

హైదరాబాదు నుండి మధురై మార్గంగా కొలంబోవరకు విమాన ప్రయాణం సాఫీగా సాగింది. కొలంబో నుండి ప్రయాణం చేసి రాత్రికి 'సిగిరియా' అనే ప్రదేశానికి చేరుకున్నాం. 'సిగిరియా' పూర్వ నామం 'సింహగిరి'`

మరునాడు 'పొలొన్నారువ' (Pononnurva) లోని అతి ప్రాచీన (11`13 శతాబ్దాల మధ్య కాలం) విశ్వవిఖ్యాత కళా, శిలాఖండాలను సందర్శించాం. 11`13 శతాబ్ది మధ్య కాలంలో ఈ ప్రదేశం 'సింహళ' రాజ్యానికి రాజధానిగా ఉండిరది 'పరాక్రమబాహు' రాజు కాలంలో నిర్మితమైన హైందవ, బౌద్ధమత ఆలయాలు, ఏడంతస్థుల రాజభవనం, లతామండపం, వివిధ భంగిమలలో, ఆకృతులలో నిర్మితమైన బుద్ధ భగవానుని విగ్రహాలు / శిల్పాలు, ఇటుకలతో నిర్మితమైన కట్టడాలన్నీ నేడు శిథిలావస్థలో ఉన్నా అలనాటి మహోన్నత





కళా వైభవానికి నిదర్శనంగా నిలిచాయి. చాలావరకు కళాఖండాలన్నీ 'కొలంబో' నగరంలోని 'మ్యూజియంలో' భద్రపరచబడియున్నాయి. మూడు గంటలపాటు సాగిన మా 'పొలాన్నారువ' సందర్శనం మా మదిలో మరుపరాని అనుభూతిని కలుగజేసింది. ఆ సాయంత్రం 'హబరానా' మార్గంగా 'ఇకో నేషనల్ పార్క్' (Eco National Park) చేరుకొని పార్క్‌లో వందలాది ఏనుగులను వివిధ ప్రదేశాల్లో చూశాం. 'సూర్యాస్తమాన' దర్శనం మరువరానిది.

'హబరానా' నుండి ముందుకు సాగితే 'ట్రింకోమల్'లోని ప్రసిద్ధ 'శాంకరీదేవి' ఆలయానికి వెళ్ళవచ్చు. అయితే మేము రాత్రికి 'సిగిరియా' చేరుకున్నాం.

మూడోరోజు శ్రీలంకలో అతి ప్రసిద్ధమైన (447`449 ఏ.డి) 1500 ఏళ్ళ నాటి సిగిరివ ఖిల్లా (Fort) దర్శించాం. 'కస్సపు' ఒకరాజు 600 అడుగుల ఎత్తైన ఒకే ఒక 'శిల'పై ఈ అద్భుత ఖిల్లాను 'నిర్మించి' చరిత్రను సృష్టించాడు. 'క్రింది నుండి పై భాగంవరకు 1202 ఎత్తైన మెట్లున్నాయి. ఈ 'కోట'లో ఆనాటి వైవిధ్యభరితమైన, సహజ సిద్ధమైన రంగులతో వేయబడిన 18 రకాల చిత్రాలు (Paintings) దర్పణ మండపం మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. 'కోట' పై భాగం నుండి సిగిరియా నగరం, జలాశయాలు, అటవీసంపద మనకు కనుల విందు చేస్తుంది. కోట క్రింది నుండి పై భాగంవరకు 'నీటి'ని చేర్చే అలనాటి విధానం, నేటి మన ఇంజనీర్లకు కూడా అంతుపట్టకుండా ఉంది. అయితే ఒక మాట ` 600 అడుగుల ఎత్తులో 1202 మెట్లు ఎక్కి పైకి వెళ్లాలంటే మానసికంగా, శారీరికంగా మనం సిద్ధపడి ఉండాల్సి ఉంటుంది. ఆ తర్వాత మా ప్రయాణం 'డంబులా' వైపు సాగింది. 'క్రీ.పూ. ఒకటవ శతాబ్ది కాలం నాటి గుహలు, అందులోని 150 రకాలు, భంగిమల్లో, బుద్ధ భగవానుని విగ్రహాలు మనల్ని



మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ముఖ్యంగా రెండవ గుహ అతి విశాలంగాను, చూడముచ్చటగా ఉంది. గోల్డన్ కేవ్ టెంపుల్ (Golden Cave Temple) మరియు రంగేలీ డంబులు విహార, తప్పక చూడాలి. 25వేల చదరపు అడుగుల్లో వివిధ రకాల విగ్రహాలు, చిత్రాలు 'డంబులా' గుహల్లో కన్పిస్తాయి. విష్ణుభగవానుని విగ్రహాలు కూడా ఉన్నాయి. మన దేశంలోని అజంతా, ఎల్లోరా గుహలను జ్ఞప్తికి తెస్తాయి. శ్రీలంకంలోని 'డంబులా' గుహలు ` 'రెండున్నర గంటలు డంబుల్లా గుహల్లో గడిపి, 'మతాలే' అనే ప్రదేశంలో సుగంధ ద్రవ్యాలు / ఆయుర్వేద వనాలను చూసి (Spice Gardens) సాయంత్రం క్యాండీ (Kandy) నగరం చేరుకున్నాం. అప్పుడే ప్రారంభమైన గంటన్నరపాటు సాగిన 'శ్రీలంక సాంస్కృతిక ప్రదర్శన' తిలకించాం. చివరగా 'మండుతున్న నిప్పులపై నడిచే' (Barefoot Fire Walk) ప్రదర్శన అద్భుతం. చూడదగిన విశేషం. ఆ రాత్రి క్యాండీ నగర్‌లో అతి ముఖ్యమైన, శ్రీలంక విశేషాలతో అద్భుతమైన బుద్ధభగవానుని మందిరం చూశాం. పవిత్రమైన బుద్ధభగవానుని పన్ను ఇక్కడ నాల్గవ శతాబ్ధంలో తీసుకురాబడి, భద్రపరచబడిరది. విద్యుద్దీప కాంతిలో గర్భగుడిలో సందర్శనం మరువరానిది (Temple of Sacred Tooth).

క్యాండీనగర సందర్శనం లేని శ్రీలంక (సింహళ) యాత్ర అసంపూర్తి అని చెప్పవచ్చు. ఇది శ్రీలంక దేశపు సాంస్కృతిక రాజధాని. చుట్టూ ఎత్తైన కొండలు మధ్యలో సరస్సు, బౌద్ధ, హైందవ దేవాలయాలు, అందమైన విశాలమైన తోటలు, ముఖ్యంగా ప్రాచీన కళాసంపదలకు నిలయమైన ఈ ప్రదేశం చూడముచ్చటగా ఉంటుంది. మరువలేని, మరుపురాని అనుభూతుల్ని కల్గజేస్తుంది.

**(ఇంకా వుంది)**

# నూటపదహార్లు కందాల్లో
# సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అధ్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం. ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశించి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

111 ) వదలెను మైకము కపులకు
వదనము లవనతము జేసి వచ్చిరి వడిగా
పదపదమని యొకరి నొకరు
కదలించిరి కదను తొక్కి కదలిరి తోడన్

111. అప్పుడు వారి మైకం వదిలింది. చేసిన పనికి సిగ్గుతో తల వంచుకుని మళ్ళీ దారి పట్టారు.

112 ) ముందుగ మారుతి రాముని
ముందర వాలెను చరణములు ముట్టెను భక్తిన్
అందరి నాశ్చర్యపరచు
సుందరమైన మణి దీసి చూడగ నిచ్చెన్

112. అందరి కంటే ముందుగా హనుమంతుడు రాముడి పాదాలపై వాలాడు. తను తీసుకు వచ్చిన ఆనవాలు, చూడామణిని రాముడి చేతిలో పెట్టాడు.

113 ) కాంచితి నమ్మను లంకను
కాంచితి నాయమ కుములుచు కన్నీరు గార్చన్
కాంచితి తపించ నీకై
కాంచితి నోరిమి వహించ కాంతుని కొరకై

113. "చూశాను చూశాను, సీతను చూశాను " అని సంతోషంతో చెప్పాడు. "ఆమె లంకలో రావణుడి చెరలో ఉంది. శ్రీరామ చంద్రుని రాక కోసం పరితపిస్తోంది.." అన్నాడు

114) కన్నుల కట్టిన యట్టుల
కన్నది కేసరి వివరముగా చెప్పంగా
కన్నుల నీరిడె రాముడు
కన్నది లేదెన్నడిట్టి కష్టములనుచున్

114. ఇంకా హనుమ లంకలో తను చూసినది, చేసినది అంతా వివరంగా చెప్పాడు. అది విన్న రాముడి హృదయం పగిలి ముక్కలై కన్నీరు పెట్టుకున్నాడు. చూడామణి-ని మరీ మరీ చూసి కంట తడి పెట్టుకున్నాడు.

115 ) కన్నీటికిది సమయమా
మున్నేటిని దాటగవలె ముందుగ నెన్నో
సన్నాహములున్నవిగా
ఉన్నపసను జూప పోదముప్పెన వోలెన్

115. అప్పుడు హనుమంతుడు ఆయనకు సాంత్వన పలికి "రామా! కన్నీటికిది సమయమా! మనమంతా వెంటనే లంక మీద దండెత్తాలి. అందుకు తగిన సన్నాహాలు చేయాలి. ఎన్నోపనులు ఉన్నాయి." అని ఆయనను తొందర పెట్టాడు.

116 ) మారుతి చెప్పగ రాముడు
రారండిపుడే కదలుడు రావణు జంపన్
ఆరాటంబులు విడువుడు
పోరాటము చేయ వెడలి పోవలె ననియెన్

116. మారుతి చెప్పిన మాటలకు రాముడు ఆయన్ని మెచ్చుకున్నాడు. సుగ్రీవాదు-లు కూడా రామ రావణ యుద్ధంలో తమవంతు బాధ్యత నిర్వహించడానికి సంసిద్ధుల-య్యారు.

# దేవదేవుని పంచ భూత లింగాలు




కొత్త రామానందం



సర్వాంతర్యామి అయిన పరమ శివుడు లింగరూపంలో భక్తులను కరుణిస్తున్నాడు. 'లిం' అంటే మామూలు చూపులకు కనిపించకుండా, లోపల ఉన్న దానిని లేక లీనమైన దానిని 'గం' అంటే ఓం గుర్తు రూపంలో చూపించడమన్న మాట. అంతటా వ్యాపించి ఉన్న ఆయనకు ఓ ఆకారం ఉండదు. అయినా మన కోసం లింగాకారములో దర్శనమి స్తా రు . ప్రపంచమంతా పరమేశ్వరమయం. కానీ ఆయన ప్రపంచానికి అతీతుడు కూడా. ఈ విశ్వాన్ని శివమయంగా భావిస్తే శివుడు క్రమంగా విశ్వాతీతునిగా అనుభవానికొస్తాడు. కనిపించే జగతిలో ప్రధానంగా ఎనిమిది అంశాలున్నాయి. 1. భూమి 2. నీరు 3. అగ్ని 4. వాయువు 5. ఆకాశం 6. సూర్యుడు 7. చంద్రుడు 8. యజమాని (క్షేత్రజ్ఞుడు లేక జీవుడు). ఈ ఎనిమిదింటిలో ఉన్న ఈశ్వర చైతన్యమే మన ఉనికికీ, మనిషికీ మూలం. వీటిని శివుని అష్టమూర్తులుగా భావిస్తున్నా ము .
ఈ సువిశాల సుందర సృష్టికి పంచభూతాలే కారణమైతే, ఆ పంచభూతాత్మక స్వరూపుడు అయన పరమ శివుడు ముందుగా ఆకాశాన్ని ఆవిష్కరించగా, దాన్నుంచి వాయువు, ఆ వాయువు నుంచి అగ్ని, అగ్ని నుండి జలం, జలం నుంచి భూమి ఏర్పడ్డాయి. ఆకాశ భూతానికి ఉన్న ఒకే ఒక లక్షణం 'శబ్దం' శబ్ద లక్షణ సమన్వితమైన ఆకాశ భూతం. ఇక ఆకాశం తరువాతది అయిన వాయువుకు శబ్దంతో పాటు 'స్పర్శ' అనే లక్షణం కూడా ఉంది. అంటే వాయువునకు తాకే, సాకే సామర్థ్యం

కూడా ఏర్పడిరది. వాయువు నుంచి పుట్టింది అగ్ని, అగ్నికి శబ్ద, స్పర్శ లక్షణాలతో పాటు రూపం సమకూరింది. ఆకాశం, వాయువులు మన కళ్ళకు కనపడకపోగా 'అగ్ని' మన కళ్ళకు కనబడుతుంటుంది. 'అగ్ని' నుండి 'జలం' ఉద్భవించింది. జలానికి అంతకు ముందున్న మూడు భూతాల లక్షణాలైన శబ్ద, స్పర్శ, రూపలక్షణాలతో పాటు 'రసం' లక్షణం అధనంగా వచ్చి చేరింది. రసం ద్వారా జీవశక్తి ఏర్పడేందుకు సుగమమైంది. చివరి భూతమైన భూమికి 'గంధం' అనే లక్షణం వచ్చి చేరింది. అనగా భూమికి శబ్ద, స్పర్శ, రూప, రస లక్షణాలతో పాటు గంధ లక్షణం కూడా కలిగింది. ఇలా పంచ భూతాత్మక రూపంలో ఉండే స్వామి సమస్త జీవుల మనుగడకు కారణమవుతున్నాడు . చిదంబరంలోని ఆకాశలింగం గురించి చెప్పుకొన్నప్పుడు 'చిత్' అంటే జ్ఞానం. అంబరం అంటే ఆకాశం. జ్ఞానం ఎలాగైతే అనంతమైనదో, అలాగే ఆకాశం కూడా అనంతమైనది. ఈ రెండు అనంతాలు ఏకమై ఒకే చోట దర్శనమిచ్చే పుణ్యస్థలం చిదంబరం. ఇది ఆది భూతమైన ఆకాశ క్షేత్రం. శ్రీ కాళహస్తిలో స్వామి వాయురూపంలో విరాజిల్లుతున్నాడు. ఈ ఆలయంలోని లింగం గుండ్రంగా కాక, చతురస్త్రాకారంగా ఉండటం విశేషం.



సద్యోజాత క్షేత్రం. స్వామి వారి తేజోమూర్తిని అరుణాచల క్షేత్రంలో చూడగలం. ఆ దేవుడే మన దేహంలో అంతరాగ్ని, వైశ్వానరాగ్ని, జఠరాగ్నివంటి అగ్నులరూపంలో ఉంటూ మనలో అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తూ ప్రాణం ఉండేట్లు చేస్తున్నాడు. అరుణాచలంలో కార్తీకమాసంలో కృత్తికా నక్షత్ర సమయంలో పార్వతీదేవికి శివుడు జ్యోతి రూపంలో గోచరిస్తాడు. అందుకు నిదర్శనంగానే అక్కడ కార్తీక పౌర్ణమినాడు ఓ పెద్ద జ్యోతిని వెలిగిస్తారు. శ్రీరంగానికి సమీపంలో జంబుకేశ్వరాలయం ఉంది. ఇచ్చట ఉన్న జలలింగం నుండి నిత్యం నీరు ఊరుతూనే ఉంటుంది. అఖిలాండేశ్వరి మాత శివుని కోసం తపస్సు ఇక్కడ చేసింది. కంచిలోని బంగారు వన్నెలతో విరాజిల్లుతున్న మూర్తి పృథ్వీ లింగమూర్తి. ఈ మూర్తికి నీటితో అభిషేకం జరపరు. మల్లె-



పూల నుండి సేకరించిన నూనెతో మాత్రమే అభిషేకం జరుపుతారు. ఆ స్వామి పంచభూతాలను మన కళ్ళముందు ప్రదర్శిస్తున్నారు. అంతా స్వామి లీలా విశేషం.

వాయులింగ శ్రీకాళహస్తి: దక్షిణభారతంలోని పంచతత్వ లింగాలలో ఒకటైన వాయులింగం శ్రీ కాళహస్తిక్షేత్రంలో స్వర్ణముఖి నదీ తీరాన దర్శనమిస్తుంది. ఈ కాళహస్తీశ్వరుని ఆలయం అత్యంత ప్రాచీన దేవాలయం. క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దానికి చెందిన సక్కీరుడనే (నక్కీరన్) తమిళ భక్తుడు తన రచనలలో శ్రీ కాళహస్తి 'దక్షిణకాశీ'గా శ్రీ కాళహస్తిని వర్ణించాడు. ఈ ఆలయం తొలుత చోళ, పల్లవ రాజుల కాలంలో నిర్మితమైందని, తదుపరి శ్రీ కృష్ణదేవరాయుల పాలనా సమయంలో విస్తృత నందిందని వివిధ శాసనాల ద్వారా తెలుస్తుంది. ఇచ్చటి రాజగోపురం 120 అడుగుల ఎత్తు కలిగిన బృహన్నిర్మాణం ఈ మధ్య కాలంలో కూలి పోవుట వల్ల తిరిగి పునర్నిర్మించారు. ఆలయంలోనికి ప్రవేశిస్తే విశాలమైన మండపాలతో, చోళ విజయనగర రాజుల కాలంనాటి శిల్పకళ, నిర్మాణ రీతులు ప్రతిబింబించే రాతి కట్టడాలు దర్శనమిస్తాయి. నటరాజస్వామి, బిక్షాటనమూర్తి, వీణా దక్షిణామూర్తి, శివ పార్వతుల కళ్యాణ దివ్యోత్సవ ఘట్టం, నటరాజస్వామి ఆప్త భక్తుడైన సాధుకవి పుంగవులు మాణిక్య వాచకర్, అప్పర్, సుందరాజ్ పత్రిమలు ఈ మండపానికి వన్నె చేకూర్చుచున్నది. ఈశ్వరుడే ఇక్కడ కాళహస్తీశ్వరుడు, పార్వతీదేవే జ్ఞాన ప్రసూనాంభ, శ్రీ కాళహస్తీశ్వరుని లింగం స్వయంభువు ఇది మామూలుగా మనకు కనిపించే లింగాల కన్నా భిన్నంగా ఉంటుంది. ఎత్తుగా లావుగా ఉంటూ పై భాగం చదరంగా ఉంటుంది. లింగం క్రింది భాగంలో సాలెపురుగు ఆకృతి కనిపిస్తుంది. పైనుంచి చూస్తే ఐదు తలల పాములా కనిపిస్తుంది. ఏనుగు తొండం ఆకారంలో రెండువైపులా దంతాలు ఉన్నట్లుంటుంది. శివాలయంలో పశ్చిమాభిముఖంగా ఉన్నందువల్ల ఇది సద్యోజాతి లింగం. ఉత్తర వాహిని అయిన నదీతీరంలో పశ్చిమాభిముఖంగా ఉన్న శివలింగ దర్శనం సాక్షాత్తూ కైలాస దర్శన సమానమై మంచి ఫలితాలను కలుగుజేస్తుంది. కాశీలో, శ్రీశైలం మాదిరిగా ఈ లింగాన్ని ఎవరికి వారు తాకి అర్చించుకోవడానికి వీలు లేదు. చివరికి అర్చకులు కూడా ఒక

మంచె
మీద
నుంచి



శా-

అభిషేకం జరుపుతారు. గర్భగు-
డిలోకి గాలి ప్రవేశించే అవకాశం
లేకపోయినా, స్వామివారికి ఇరు-
వైపుల ఉన్న దీపతోరణం పూర-
కరేచకాలకు ప్రత్యేకంగా రెపరెప-
లాడుతూ కదలాడుతూ
ఉంటాయి. ఇదే వాయులింగమ-
నడానికి నిదర్శనం. అనాదికా-
లంలో స్వామిని అర్చించి ముక్తి
పొందిన సాలెపురుగు, పాము,
ఏనుగుల చిహ్నాలు కన్నప్ప సమ-
ర్పించిన కన్ను లింగంపై దర్శన-
మిస్తాయి. స్వామికి నవగ్రహకవ-
చం నిత్య అలంకరణగా
అమరింది.

శ్రీ కాళహస్తికి, జ్ఞానానికి, జీవికి
ఉన్న సంబంధాన్ని తెలియజెప్పేవే
ఇక్కడి స్థలపురాణ కథలన్నీ, 'శ్రీ'
అంటే ఇక్కడ సాలెపురుగు అని
అర్థం. 'కాళ' మంటే పాము
'హస్తి' అంటే ఏనుగు, ఈ మూడు
స్వామిని భక్తితో సేవించి ముక్తి
పొందిన క్షేత్రం కనుక 'శ్రీకాళహ-
స్తి' అనే పేరు వచ్చింది. పాము,
ఏనుగుల అజ్ఞానం ఎంతటిదం-
టే మణులతో పాముచేసే పూజ
ఏనుగుకు, సువర్ణముఖ
జలాలతో ఏనుగు చేసే పూజ
పాముకు నచ్చలేదు. శత్రుత్వం
పెంచుకొని పరస్పరం స్వామి వారి
చెంత పోరాడి మరణించారు.
స్వామి వారు వాటికి ముక్తి
నొసంగెను.

సాలెపురుగు ముందు జన్మలో
దేవశిల్పి అయిన విశ్వకర్మ
కుమారుడు పేరు ఊర్ణనాభుడు.
అతడు బ్రహ్మసృష్టికి ప్రతిసృష్టి
చేయడం ప్రారంభించాడు. బ్రహ్మ
కోపగించాడు. గజారణ్యంలోని
బిల్వవనంలోని సాలెపురుగువై
పుట్టమని శపించాడు. ఊర్ణనా-
భుడు క్షమాభిక్ష వేడుకోగా
అప్పుడు అక్కడి శివుని అర్చించి
పవిముక్తడవుతావని బ్రహ్మ ఊర-
డిరచాడు. బిల్వవనంలో ఒక
మారేడు చెట్టు నాశ్రయించుకొని
సాలెపురుగుగా జీవిస్తూ
ఉంటాడు. ఒకసారి ఒక శివభక్తు-
డు ఆ మారేడు చెట్టు ఆకులను
కోసుకొని సువర్ణముఖీనదికి వెళ్లి
స్నానం చేసి ఆలయానికి బయ-
లుదేరతాడు. అప్పుడు అతనికి
అంటిఉన్న నదీజలం బుట్టలోని
మారేడు దళాలపై పడిరది ఆ
దళాలను ఆశ్రయించుకున్న సాలె-
పురుగు కూడా నదీ జలం వల్ల
పవిత్రుడయ్యాడు.

శివభక్తుడు మారేడు దళాలతో
శివుని అర్చించినప్పుడు సాలెపు-
రుగు కూడా లింగం మీద పడ్డాడు.
అతనిలోని భక్తి అంకురించింది.
సమీపంలోని ఒక చెట్టుమీదకు
ప్రాకి శివునికి ఎండ తగలగూడ-

దని లింగంపై ఒక గూడు అల్లాడు. అతని భక్తిని పరీక్షించాలనుకొని శివుడు తన సమీపంలో వెలుగుతున్న దీప జ్వాలను పెరిగేలా చూసాడు. తను అల్లిన గూడు దగ్ధమై శివునికి నీడ కరువవుతుందని భయపడి సాలెపురుగు ఆజ్వాలను మింగపోయాడు. చివరకు ఆ జ్వాల సాలెగూడుని దగ్ధం చేసింది. సాలెపురుగు దు:ఖించి ఆ జ్వాలలో పడి ఆత్మాహుతి చేసుకున్నాడు. శివుడు సాలెపురుగు భక్తికి మెచ్చి ముక్తిని ప్రసాదించాడు.

కన్నప్ప కథ:

శ్రీ కాళహస్తిలో ముడిపడిన మరో ప్రసిద్ధగాథ భక్త కన్నప్పది అతని అసలు పేరు తిన్నడు. పాండవ మధ్యముడైన అర్జునుడే తిన్నడుగా జన్మించాడనే కథ కూడా స్థల పురాణంలో ఉంది. ఒకసారి వేటకు వెళ్లి, అడవిలో ఉన్న శ్రీ కాళహస్తీశ్వరుని చూసాడు. భక్తి ఏర్పడిరది. రోజూ శివునికి వేటాడిన పచ్చి మాంసాన్ని రెండు చేతుల్లో తీసుకొని, స్వర్ణముఖీ జలాన్ని పుక్కిట బట్టి శివలింగాన్ని సమీపించి ఆ నీటితో అభిషేకించి, మాంసాన్ని ఆరగింపు పెట్టేవాడు. శివుడు అతని భక్తికి మెచ్చి స్వయంగా ఆ మాంసాన్ని భుజించేవాడు. ఒకసారి అతని భక్తిని పరీక్షించదలచి, శివుడి కంటి నుంచి రక్తం కారడం ప్రారంభించింది. కన్నుకు కన్నే మందనుకున్నాడు. తిన్నడు. తక్షణమే తన కన్ను పెకలించి స్వామికి అర్పించాడు. శివుడు పరీక్ష అంతటతో ఆగలేదు. రెండవ కంటి నుంచి కూడా రక్తం కారసాగింది. తిన్నడు ఆ కన్నున్న చోట తన పాదాన్ని తాకించి పెట్టి, తన రెండో కన్నును కూడా పెకలించి అక్కడ అతికించాడు. శివుడు తిన్నని భక్తికి పరమ సంతుష్టుడై తిరిగి చూపు ఇవ్వడమే కాక ముక్తిని ప్రసాదించాడు. శ్రీ కాళహస్తిలో ఆలయ ప్రధాన ద్వారానికి ఎదురుగా భకకన్నప్ప విగ్రహం కనిపిస్తుంది. ఈ భక్తాగ్రేసరునికి కన్నప్ప పేర స్వామి ఆలయానికి చేరువలో ఒక కొండపై కన్నప్ప ఆలయాన్ని నిర్మించారు.

అద్భుత జ్ఞాన ప్రసూనం:

శ్రీ కాళహస్తీశ్వరస్వామి అర్ధాంగిగా శ్రీ జ్ఞాన ప్రసూనాంభికాదేవి, ఆలయ ప్రాంగణములో వేరొక ఉపాలయంలో విరాజిల్లునున్నది. పతిదేవునికేమీ తీసిపోని తీరులో అద్భుతశక్తిగా, అపురూప భక్తివాత్సల్యస్వామినిగా విరాజిల్లుతున్నది. అసలు అమ్మవారి పేరులోనే అమె ఘనత నిక్షిప్తమై ఉంది. ఆమె జ్ఞాన ప్రసూనం అంటే వేలాది విజ్ఞాన దళాలతో కూడిన జ్ఞాన పద్మం. ఆమెను భక్తితో దర్శిస్తేనే, శ్రద్ధతో తపిస్తేనే నిష్టతో కొలిస్తేనే దివ్య దర్శనం సిద్ధిస్తుంది. ఆదిశంకరుడు స్థాపించిన శ్రీ చక్రం అమ్మవారి సన్నిధిలో ఉంది. గతంలో ఆమె సతీదేవి దక్షయజ్ఞం సమయంలో తనపతిదేవునికి జరిగిన పరాభవాన్ని తట్టుకోలేక పరాశక్తి పార్వతీదేవి తనదేహాన్ని స్వీయ యోగమాయతో దగ్ధం గావించుకొంటుంది. తన ప్రాణ ప్రియ దగ్ధ దేహాన్ని భుజాన వేసుకొని మహోన్మత్తుని వలె లోకంలో సంచారం చేస్తుండగా మహావిష్ణువు సుదర్శన చక్రంతో ఖండఖండాలు గావిస్తూ ముక్కంటిని శాంతిప చేయ ప్రయత్నిస్తాడు. అలా తెగిపడిన సతీదేవి దేహంలోని కపాలభాగం, భూలోక దక్షిణకాశీ ` శ్రీ కాళహస్తి క్షేత్రంలో నిక్షిప్తమైంది. దేహంలో కపాలభాగం జ్ఞాన నిలయం కనుక ఇక్కడ అమ్మవారు జ్ఞాన ప్రసూనాంభగా అవతరించినది. మరియు సతీదేవి దేహభాగాలు పడిన 108 శక్తి పీఠక్షేత్రాలలో శ్రీ కాళహస్తి 'జలందర పీఠం'గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో, చిత్తశుద్ధితో కొలిస్తే వారి అభీష్టాన్ని 'దక్షిణామూర్తి' ద్వారా జ్ఞాన ప్రదానం చేస్తుందని విజ్ఞుల విశ్వాసం. మరో విషయం జ్ఞాన ప్రసూనాంబ తిరుమల వెంకటేశ్వరుని చెల్లెలేనట. వేంకటేశ్వరుడు ధనమైతే ఈమె జ్ఞానం. ధనం దగ్గర ఆగిపోకుండా జ్ఞానానికి ప్రయత్నించాలని చెబుతారు. జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని నమ్మకంతో కొలిచిన వారికి ఆమె తన కరుణతో కన్యలకు సత్వరం వివాహం అయ్యేట్లు చూస్తుంద-



ని, ఇక వివాహితులకు శీఘ్రమే సంతానప్రాప్తి కలిగేటట్టు చేస్తుందని ప్రగాఢ నమ్మకం.

రాహుకేతు శాంతి పూజలు

ఆలయ ఆవరణలో సర్పదోష, నాగదోష సంబందమైన రాహు, కేతు గ్రహ శాంతి పూజలు భక్తులు చేయించుకుంటారు. శివ పరమాత్మ సాన్నిధ్యంలో రాహు, కేతు గ్రహాలకు శాంతి పూజలు చేస్తే తమకు కోరిన శుభాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. శ్రీ కాళహస్తి క్షేత్రం కూడా రాహుకేతు క్షేత్రంగా ప్రసిద్ధి చెందుటచే దేశంలోని నలుమూలల నుంచి జనులు ఇచ్చటకు వచ్చి శాంతి పూజలు నిర్వహిస్తారు.

పాతాళ వినాయకుని ఉపాలయం

ఆలయావరణంలో ఉత్తరగోపురం గుండా కొద్దిదూరం వెళితే వినాయకుని సన్నిధి ఉంది. ఈ గణపతిని 35 మెట్లు క్రిందికి దిగి దర్శించవలసి ఉంటుంది. ఆయన మహాశక్తిసంపన్నుడు ఒక పర్యాయం అగస్త్య మహాముని ఈయనను దర్శించనందున సువర్ణముఖి ఎండిపోయేట్లు చేశాడని, అగస్త్యుడు ఎన్నో ఆటంకాలు ఎదుర్కొన్నాడని కథనం.

ఆలయంలో నిత్య కళ్యాణాలు

ఆలయంలో నిత్యం జరిగే కళ్యాణోత్సవంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటారు. ప్రతిరోజూ స్వామివారికి రుద్రాభిషేకం ప్రతి పౌర్ణమినాడు అయ్యావారికి అమ్మవారికి ఊంజల్‌సేవ, మాసోత్సవాలు నిర్వహిస్తారు. ఏటా ఆలయంలో ఎనభై అయిదు రకాల ఉత్సవాలు జరుగుతాయి.

శివరాత్రి ` బ్రహ్మోత్సవాలు

అత్యంత వైభవముగా శ్రీ కాళహస్తిలో శివరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులు ఘనంగా జరుపుతారు. అయిదో రోజు శివరాత్రి. లింగోద్భవ కాలంలో స్వామికి పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. తొమ్మిదవ రోజు రాత్రి ఆది దంపతులను ఊరేగింపుగా అన్ని లాంఛనాలతో గిరి ప్రదక్షిణ ఉత్సవాలను నిర్వహిస్తారు.

అత్యంత అంకిత భావంతో భరద్వాజ మహర్షి సగోత్రులు, వారి శిష్య పరంపరకు చెందిన వారే ఇక్కడ అర్చక స్వాములుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

భక్తులు తమ తిరుపతి యాత్రలో భాగంగానే శ్రీ కాళహస్తి క్షేత్రాన్ని దర్శించి వెడుతుంటారు. ఆ విధంగా శివకేశవుల మధ్య తేడా లేదన్న సత్యాన్ని వారు అనుభవంలోకి తెచ్చుకుని మననం చేసుకుంటారు.

`ఓం నమశ్శివాయ

# ప్రేమంటే ఇంతే



ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

(గతసంచికతరువాయి)

కృష్ణమోహన్ చెప్పినది విని ఆశ్చర్యపోయింది అనూరాధ. ఆనందంతో "అద్భుతం బావా, నిన్ను ఏమని పొగడాలో నాకు అర్థం కావడంలేదు. 'ఏ మనిషయినా అనుకున్నది సాధించలేకపోతే తన ఓటమికి కుమిలిపోతాడు, జీవితం మీద ఆసక్తి లేక వైరాగ్యానికి గురి అవుతాడు, లేదా దురలవాట్లకు బానిస అవుతాడు, లేదా క్రూరుడుగా మారతాడు. అలాంటిది నీ మనసులో ఎంత ఆవేదన వున్నా ఇరవైఆరు మంది ప్రేమ జంటలకి వివాహం జరిపించినందుకు నా అభినందనలు. నిజంగా నీ ఓటమి మీద విజయాన్ని సాధించావు'. నువ్వు చేస్తున్న కృషి ముదాహవం, అత్యంత శ్లాఘనీయం, నాకు చాలా ఆనందంగా వుంది" అని మనస్ఫూర్తిగా అభినందించింది అనూరాధ...

..."సరే ఆ అప్పారావు ఎవరు? సడన్‌గా అక్కడ ప్రత్యక్షమయ్యాడు" అని అడిగింది అనూరాధ.

"అతను పోలీస్ కానిస్టేబుల్, అతని తండ్రి మా నాన్నగారి ఆఫీస్‌లో పని చేసేవాడు. అప్పారావ్‌ది కూడా ప్రేమ వివాహమే, మేనమామ కూతురు. కానీ వాళ్ళ బంధుత్వాలు సరిగా లేకపోవడంతో అప్పారావు తల్లి ఒప్పుకోలేదు. అప్పుడు నా దగ్గరకు వచ్చి మీరు నాకు సహాయం చేయండి అని అడిగాడు అప్పారావు. వాళ్ళ అమ్మగారిని, మామయ్యని పిలిపించి మాట్లాడాను, మూడు సమావేశాల తరువాత మొత్తానికి మా కుటుంబం మీద గౌరవంతో ఒప్పుకున్నారు. అప్పటి నుండి అప్పారావుకి నేనంటే విపరీతమైన ప్రేమ, భక్తి, గౌరవం. ఇప్పుడు పూడిమడక పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్నాడు. ఇకపోతే అనకాపల్లి డి.ఎస్.పి. మా తమ్ముడి క్లాస్‌మేట్" అని వివరంగా చెప్పాడు కృష్ణమోహన్.

"కిరణ్, సింధు చాలా అదృష్టవంతులు సమయానికి మనము అక్కడకి వెళ్ళడం, అప్పారావు కనబడటం, వాళ్ళ తల్లితండ్రులతో మనము నడిపిన వ్యవహారం అంతా సరైన దిశలో జరిగింది" అంది అనూరాధ.

"రాధా 'ఇతరులకు సహాయం చేయడంలో వుండే తృప్తికి సాటి ఏదీ వుండదు కదా' అన్నాడు కృష్ణమోహన్.

"అవును బావా ఆ తృప్తే వేరు" అంది అనూరాధ.

ఇంటికి చేరేసరికి ఎనిమిది దాటింది. రుక్మిణి కాఫీ తీసుకొచ్చి ఇద్దరికీ ఇచ్చింది. "కాఫీ తాగి మీరిద్దరూ ఫ్రెష్ అవండి. ఎప్పుడు తిన్నారో, ఎక్కడ తిన్నారో భోజనాలు చేసి కబుర్లు చెప్పుకుందాము" అంది రుక్మిణి.

కాఫీలు తాగి స్నానాలు చేసి భోజనాలయిన తరువాత అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. కృష్ణమోహన్ ప్రసాదం పేకెట్ కారులోంచి తీసుకొచ్చి రుక్మిణికి ఇచ్చాడు. తను తిని పిల్లిద్దరికి ఇచ్చింది రుక్మిణి. ప్రసాదం తిన్నాక వంశీ, సుప్రియ

వాళ్ళరూంలోకి వెళ్ళి కబుర్లు చెప్పుకుంటున్నారు.

"వదినగారికి ఫోన్ చేసి అనూని రేపు డ్రాప్ చేస్తామని చెప్పాను.

ఇప్పుడు చెప్పండి..,ఎలా జరిగింది మీ ప్రయాణం స్వామివారి దర్శనం బాగా జరిగిందా? ట్రిప్ ఎంజాయి చేసారా? ఇంత ఆలస్యం అయిందేమి?" అని అడిగింది రుక్మిణి.

"ఇది దారుణం రుక్మిణి, అన్నవరం ట్రిప్ గురించి నాకు మాట వరసకైనా చెప్పలేదు. ఇదంతా నీ డైరెక్షనేనట, నువ్వు ఖతర్నాక్" అంది రాధ. రుక్మిణి చిరునవ్వే సమాధానమయింది...

"స్వామి వారి దర్శనం చాలా బాగా జరిగింది, ట్రిప్ మొత్తం బాగా జరిగింది," అని అన్నవరం విశేషాలు చెబుతూ ఆ వేద పండితుడి గురించి కూడా చెప్పింది అనూరాధ.

"అయ్యో అలాగా, అ బీద బ్రాహ్మణుడికి మూడు వందల రూపాయలిచ్చి మంచి పని చేసారు అని మెచ్చుకుని ఇంకెక్కడికి వెళ్ళారు" అని అడిగింది రుక్మిణి.

కృష్ణమోహన్ చెప్పబోతూ వుంటే ఆపి..."ఏం చెప్పమంటావు, పూడిమడక బీచ్‌కి వెళ్ళాము" అని అక్కడ జరిగినది, హరిపాలెంలో జరిగినది వివరంగా చెప్పి "తల్లీ ఈ జగన్నాటకసూత్రధారి తన దీన జనోద్ధరణ అనే నాటకంలో నా చేత కూడా నటింప చేసాడు" అని అనూరాధ నవ్వుతూ చెప్పింది.

"మీరిద్దరూ మీ నాటకాల అనుభవాన్ని ఈ రోజు ఒక మంచి పనికి ఉపయోగించారన్నమాట, చాలా సంతోషం. నువ్వు అదృష్టవంతురాలివి, ఇద్దరు ప్రేమికులని కలిపే మంచి అవకాశం అనుకోకుండా నీకు వచ్చింది. ఆయన ఇంతవరకూ చేయించిన ఇరవైఆరు పెళ్ళిళ్ళలో నాకు ఎప్పుడూ ఇలాంటి అవకాశం రాలేదు" అంది రుక్మిణి.

"అమ్మా! మీరిద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్, మీతో మాట్లాడి నెగ్గలేము అంతా కృష్ణ మాయ" అని చమత్కరించింది అనూరాధ.

"మీరిద్దరూ మీ,మీవేదనలనుండి పూర్తిగా బయటకి వచ్చినట్లేనా? ఒక విషయం చెబుతాను సరైన దృక్కోణంలో తీసుకోండి...'పెంచుకుంటే పెరిగేది అనుబంధం, పంచుకుంటే తరిగేది బాధ, పెంచుకున్నా పంచుకున్నా మిగిలేది జ్ఞాపకం' అని ఎక్కడో విన్నాను. అలా పంచుకుంటే మీ బాధ తరుగుతుందనే ఈ అన్నవరం ట్రిప్ సలహా ఇచ్చాను. 'పంచుకున్నా మిగిలేది జ్ఞాపకమే కనుక ఈ 'జ్ఞాపకాన్ని' మీరిద్దరూ పదిలంగా దాచుకోండి' అన్నవరం ట్రిప్ గురించి తన మనసులో మాట చెప్పింది రుక్మిణి.

"నా వేదన నుండి సంపూర్ణంగా బయటికి వచ్చాను, అందుకు నీకు నా ధన్యవాదాలు. రుక్మిణీ నేను ఏమైనా అంటే మీ భార్యాభర్తలిద్దరూ మునగ చెట్టు ఎక్కిస్తున్నాను అంటారు, కానీ నువ్వు ఒక విశిష్టమైన సానుకూల దృక్పథం గల వ్యక్తివి. ఇదివరకు చెప్పినట్లు కృష్ణకి నిన్ను భార్యగా నిర్ణయించడం ఆ దేముడు చేసిన అద్భుతమైన పని. అందుకు ఆ భగవంతునికి కృతజ్ఞతలు" అని కృతజ్ఞతా పూర్వకంగా రుక్మిణి రెండు చేతులూ పట్టుకుని చెప్పింది అనూరాధ.

"శ్రీవారు చాలాసేపటి నుండి ముసి ముసి నవ్వులు నవ్వుతున్నారు, మీ సంగతి ఏమిటి? మీ మనసులోని కలత తీరిందా?" అని కృష్ణమోహన్‌ని అడిగింది రుక్మిణి.

"మీరజాలగలడా నీ యానతి... సత్యాపతి" అంటూ చమత్కారంగా జవాబిచ్చాడు.

"నిజమే సత్యాపతి మీరలేడు, కానీ రుక్మిణీపతి మీరగలడు" అంటూ

కౌంటరిచ్చింది రుక్మిణి. రుక్మిణి సమయస్ఫూర్తికి అనూరాధకి విపరీతమైన నవ్వు వచ్చింది.

"అనూ నీ సంగీతం వినాలని ఎంతో ఎదురు చూస్తున్నాను, నువ్వు మంచి కీర్తనలు పాడి వినిపించాలి" అంది రుక్మిణి.

"తప్పకుండా నీ కోరిక తీరుస్తాను. నువ్వు నా కోసం ఇంత చేసాక నేను ఆ మాత్రం చేయలేనా" అని కొన్ని త్యాగ రాజ కీర్తనలు, అన్నమయ్య కీర్తనలు అనురాధ పాడింది, వాటిని రుక్మిణి, కృష్ణమోహన్ తన్మయత్వంతో విన్నారు.

"అద్భుతంగా పాడావు, నిజంగా సంగీతం నీకు ఆ భగవంతుడు ఇచ్చిన వరం. నాకు సంగీతమంటే చాలా ఇష్టం, నేను సంగీతం నేర్చుకుందాము అనుకున్నాను కానీ నాకు రాసి పెట్టి లేదు" అని అనూరాధని అభినందించింది రుక్మిణి.

"మేడం మనకు ఏది రాసిపెట్టివుంటే దానితో సరిపెట్టుకోవాలి" అని రుక్మిణితో అన్నాడు కృష్ణమోహన్.

"నీకు ఇదే మంత్రం వేస్తున్నాడన్నమాట" అంది అనూరాధ.

“మరే, శ్రీ కృష్ణులవారికి ఎవరిని ఎలా మేనేజ్ చెయ్యాలో వెన్నతో పెట్టిన విద్య" అంటూ కృష్ణమోహన్ వంక ఓరగా చూసింది రుక్మిణి.

"ఆడవారి మాటలకు అర్థాలే వేరులే అన్నాడు కవి" అన్నాడు కృష్ణమోహన్.

"మగవారి మాటలకు అర్థాలే వుండవులే అని ఉంకో కవి అన్నాడు” అని రుక్మిణి కౌంటర్ ఇచ్చింది. ఆ మాటలకి ముగ్గురూ హాయిగా నవ్వుకున్నారు.

"బావా నాకు చాలా ఆనందం కలిగించిన విషయం రుక్మిణి నీకు సమ ఉజ్జీ, ఇలా కౌంటర్లు ఇస్తేనే నువ్వు లొంగుతావు" అంది అనూరాధ.

***********

మర్నాడు ఉదయం అనూరాధని దిగబెట్టే ముందు అనూరాధకి చీర, జాకెట్టు బట్ట పెట్టి ఆ రాధాకృష్ణుల చిత్రాన్ని బహుకరించారు కృష్ణమోహన్ దంపతులు. అనూరాధకి ఆ భార్యాభర్తల ప్రేమాభిమానాలు చూసి ఆనందంతో కళ్ళు చెమర్చి మాట మూగబోయింది. అనూరాధ చాలా ఉద్వేగానికి గురి అయి రుక్మిణిని కౌగిలించుకొని వెక్కి వెక్కి ఏడవ సాగింది.

రుక్మిణి అనూరాధ కళ్ళని తుడిచి “అక్కా ఇది నీ ఇల్లు, నీకు ఎప్పుడు రావాలని వుంటే అప్పుడు నిస్సంకోచంగా రావచ్చు” అంది.

"థాంక్యూ రుక్మిణి, మీ భార్యాభర్తలిద్దరూ కలకాలం ఆనందంగా వుండాలి" అని రుక్మిణి చెక్కిలి మీద చుంబించింది. కృష్ణమోహన్ ప్రక్క తిరిగి..."బావా నాకు చాలా సంతోషంగా వుంది, ఇంక మనం బయలుదేరుదామా?" అని అంది.

రుక్మిణి కారు దగ్గరికి వచ్చి "అక్కా అనవసరమైన ఆలోచనలు చెయ్యకు, ఆరోగ్యం జాగ్రత్త, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఫోన్ చెయ్యి, సంకోచించ వద్దు"

"అలాగే గాని నీ ఆరోగ్యం జాగ్రత్త, ఎక్కువ అలసి పోవద్దు" అంది అనూరాధ.

కృష్ణమోహన్ కారు స్టార్ట్ చేసాడు. రుక్మిణి చెయ్యి వూపి అనూరాధకి వీడ్కోలు చెప్పింది. అనూరాధని రాజేశ్వరరావు ఇంటి దగ్గర దింపి రావడానికి బయలుదేరాడు కృష్ణమోహన్.

కొంత దూరం వెళ్ళినాక "బావా నన్ను మరిచిపోవుకదా"...అనూరాధ మాట పూర్తి కాకుండానే అనూరాధ నోటిని కృష్ణమోహన్ చేతితో మూసి ఎమొషనల్ అయి కారు ఆపి అనూరాధని అక్కున చేర్చుకుని ,

( 41 వ పేజీ చూడండి)

# హాస్యమా నీవెక్కడ?

ఎలక్ట్రాన్



బహుభాషా నిలయమైన భారత దేశమునందు క్రీస్తుశకము 2003 వ సంవత్సరమును అధికారభాషా సంవత్సరముగా పరిగణించిన సందర్భములో, 'మనమందరమూ తెలుగువారము-తెలుగే మాట్లాడుదాము,' అని అప్పటి ఆంధ్రప్రదేశ్ అను రాష్ట్రము అధికార ప్రకటనలూ, విన్నపములూ చేసినది. ఆంగ్లపదములు విరివిగా ఆధునిక తెలుగు సాహిత్యమునందు చొరబడిపోయిన నేపథ్యములో ఈ ప్రకటనలూ విన్నపములూ నా కలమునకు సహస్రాధిక శృంఖలములు వేసినవి. అదియునూ కాక, శ్రీ వెంకటేశ్వరస్వామి నిలయమైన తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగిన తర్వాతనూ, తెలుగుభాషకు తెగులు పట్టి అంతరించి పోతోందన్న అంతర్జాతీయ భాషానిపుణుల నివేదికల ఆధారంగా మనవారు చేసే నిత్య ఘోషల వలననూ, దూరదర్శన ప్రసార వాహినులలో మన వ్యాఖ్యాతలు సంకర భాషతోనూ, ఉచ్చారణాదోషాలతోనూ వ్యవహరిస్తున్న తీరు చూసిన తర్వాతనూ మన భాష గురించి ఆలోచనలో పడుట జరిగినది.

మరియును పత్రికల వారు రచయితల, రచయిత్రుల, కవుల, కవయిత్రుల ప్రోత్సాహ నిమిత్తమూ ప్రతి సంవత్సరము కథల, నవలల, కవిత్వాల పోటీలు ప్రకటించుచునే ఉన్నారు. కథలకు సంబంధించి-హాస్య, లేదా కామెడీ కథలపోటీలు ప్రత్యేకముగా నిర్వహింప బడుచున్నవి.

ఛందోబద్ధమైన కవిత్వానికి కాలం చెల్లిపోయి- వచన కవిత్వానికి, పాద సంఖ్యాబద్ధమూ, అక్షర సంఖ్యాబద్ధమైన కవిత్వాలకి పునాదులు బహు దిట్టముగా పడిపోయినవి. సరే కవిత్వానికీ నాకూ చుక్కెదురు కాబట్టి, కథలనే అప్పుడప్పుడు వ్రాయడం నాకో కాలక్షేపం కాబట్టి, కామెడీ కథల నిడివి తక్కువగా ఉండాలన్నది పత్రికలవారి నిబంధన కాబట్టి-ఓ రెండుమూడు పేజీలు వ్రాసి పారేస్తే సరిపోతుందన్న దురుద్దేశ్యంతో హాస్యకథలవైపు దృష్టి సారించి, దిగువస్థాయిలో నా సామర్థ్యము మేరకు కొంత అధ్యయనము చేయుట జరిగినది.

ముందస్తుగా ఈ 'కామెడీ' అను పదమునకు సరైన తెలుగు పదమేదన్న ఆలోచన కలిగినది. వెంటనే శంకరనారాయణగారి ఆంగ్ల-తెలుగు పదనిఘంటువు చూసిన తదుపరి 'కామెడీ' అనగా సంతోషకరమైన నాటకాము అని తెలిసినది. అయితే వెనువెంటనే కుండలీకరణాల్లో ఆంగ్లములో ఇచ్చిన వివరణ ప్రకారము సంతోషకరముగా ముగియు నాటకము అని కూడా తెలుసుకొనుట జరిగినది. ఈ ఇచ్చిన అర్థములో కానీ, వివరణలోకాని హాస్య ప్రసక్తి లేదు కావున సంతోషకరమైన విషయమునే హాస్యముగా భావించవలసి వచ్చినది. అయితే 'కమెడియన్' అను పదమునకు సంతోషకరమైన నాటకములు వేయు నటుడు, నటి, హాస్యగాడు, వి-

నోదపరచువాడు, హాస్యనటి అని భాష్యములు చెప్పబడినవి. అయితే 'హ్యూమర్' అను అను పదమునకు నవ్వును పుట్టించు చమత్కారశక్తి అనియు, హ్యూమరస్ అను పదమునకు 'హాస్యమైన' అనియు చెప్పబడినది. హ్యూమరిస్ట్ అను పదమునకు హాస్య రచయిత, హాస్య నటుడు అని అర్థములు ఇవ్వబడినవి. అయితే మౌలికంగా కామెడీ కథకి, హాస్యకథకి మధ్యనున్న అంతరం తెలియకపోయినా కామెడీ కథలపోటీ అన్నా, హాస్యకథల పోటీ అన్నా, నవ్వు పుట్టించే కథ రాసిపారేస్తే అది రెండు విభజనలకీ సరిపోతుందని అనుకోవాల్సి వచ్చింది. రెండింటికీ మధ్య గీత ఎలా గీయాలో నాకు అవగతం కాలేదు.

అయితే 'జోక్' అనే పదానికి కూడా శంకరనారాయణగారు ఏమంటారో అని చూస్తే పరిహాసము, ఎగతాళి లేదా హాస్యోక్తి, లేదా హ్రస్వ హాస్య ప్రసంగము అని వ్రాయబడినది. 'ఫన్' అను పదమునకు కూడా ఇదే అర్థమివ్వబడినది. సరే ఇంతా తెలుసుకొని-'సెటైర్' కూడా హాస్య సృష్టి చేస్తుంది కదా అని ఆ పదమునకు అర్థం వ్యంగ్యమని తెలిసిన నేను, నిఘంటువు పేజీలు తెరవడం జరిగినది. అపహాస్యముతో కూడిన దూషణ కావ్యము, వ్యంగ్య కావ్యము అని తెలుసుకోవడం జరిగినది. సెటైరైజ్ అను పదమునకు 'హాస్యము చేయుచూ దూషించు' అని చెప్పుట జరిగినది.

సరే, నా ఆంగ్లభాషా పరిజ్ఞానంలో శాడిజం అనే పదం మిగిలిపోయింది కదాని ఆ పదాన్ని వెదికాను. 'పరహింసా ప్రకోపిత ఆనందం', 'పరహింసా ప్రకోపిత కామేచ్ఛ' అని రెండు భాష్యాలు కనబడ్డాయి. చిన్నమాటలో చెప్పాలంటే పైశాచికానందం. చేసేవాడికి నవ్వులాట. అనుభవించేవాడికి అవమానం. చూసేవాడికి సానుభూతి.

యివియే కాక 'విట్' అను మరొక పదం ఉన్నది. దీనికి బుద్ధి, చమత్కారము అని వివరణలు కలవు. చమత్కార సంభాషణాలలో మాటకు మాట అంటే 'రిపార్టీ' చాలా అవసరం. అంటే విసురుకు ప్రతి విసురన్నమాట. వియ్యాలవారి కయ్యాల జానపద గీతాలు ఓ చక్కటి ఉదాహరణ. అయితే ఒక్కోసారి ఈ చతుర సంభాషణలు తీవ్రమైన ఎద్దేవా రూపు సంతరించుకొని విపత్కరమైన పరిస్థితులకు దారి తీసే, పరిస్థితులూ ఉంటాయి.

కామెడీ అనగా సుఖాంతమనియూ, ట్రాజెడీ అనగా దుఃఖాంతమనియూ అనే అభిప్రాయము నాకు ఉండేది. లక్షణగ్రంథాలు చదవక పోయినా, నిఘంటువులను చూస్తే ఈ ఆలోచన కొంతవరకూ సవ్యమే అనిపించింది. గంభీరమైన సన్నివేశాలతో, శోకరసభరితమై దుఃఖాంతమైన నాటకము కానీ, కథ కానీ, చలనచిత్రము కానీ ట్రాజెడీ అనుకోవాలి. అయితే చివరలో సుఖాంతమైనచో అది కామెడీ అగునా? అవదనే అనుకొంటాను.

అటులనే హాస్యసంభాషణలతో, హాస్యసన్నివేశములతో సుఖాంతమగునది-ప్రేక్షకులను, వీక్షకులను రంజింప చేయలేక-వారికి విసుగును కలిగించే కామెడీని ట్రాజెడీ అనవచ్చునా? నిర్మాత విషయంలో లాభార్జన దృష్ట్యా అది ట్రాజెడీయే. ప్రేక్షకులకు, చదువరులకు అభిరుచినిబట్టి అటూ, ఇటూనూ.

ఇదే కాక నాటకములకు, చలన చిత్రములకు 'స్లాప్ స్టిక్ కామెడీ' అను మరొక గుణ విశేషముంది. ఒక వెదురు బద్దతో కానీ, పేము బెత్తముతో కానీ ఎవర్నైనా

కొడ్తే వాతలు తేరుతాయి. కానీ వాటిని నిలువునా పిడి వరకు చీల్చి, పిడి పట్టుకొని కొడ్తే అవి ఎక్కువశబ్దము చేస్తాయికాని దెబ్బలు తీవ్రంగా తగలవు. తెరలు తెరలుగా గొల్లుమని నవ్వించు నాటక ప్రదర్శనలను ఈ విధముగా వర్ణిస్తారు. చలనచిత్ర దర్శకులు నాయకులచేత మాటమాటకీ, మాటిమాటికీ తమ అనుచరుల చెంపలు వాయగొట్టించి హాస్యసృష్టికి చేసే ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉంటున్నాయి. ఈ దవడలు పగలకొట్టే సన్నివేశాలు ప్రతి చిత్రములోనూ సాధారణమైపోయినది.

వెదురుబద్దల కామెడీలో త్వరిత సన్నివేశ హాస్యము ప్రధానమైనది. చాప్లిన్ చలనచిత్రములు, భమిడిపాటివారి నాటకములు ఈ కోవకి చెందినవే. సన్నివేశ హాస్యానికి 'వోడ్ హౌస్' రచనలు ప్రతికలుగా నిలుస్తాయి. సంభాషణా చాతుర్యము ఈ గుణవిశేషాన్ని మరింతగా బలపరుస్తుంది. 'జోసెఫ్ హెల్లర్' రాసిన 'క్యాచ్ -22' అను సుదీర్ఘమైన నవల సన్నివేశ హాస్యముతో ఆద్యంతమూ ఉత్కంఠ కలిగిస్తుంది. శబ్దాడంబరంతో హాస్యసృష్టి చేసే ప్రయత్నములు చాలామంది రచయితలు చేయుచున్నారు.

మగవారు వంటలు చేయుట , సన్మాన సభలు చేయించుకొనుట, పోటీలు పడి చీరలు కొనూట, గురకలు పెట్టేవారితో పాట్లు పడుట, తెలివి మీరిన పనిమనుషులతో యిక్కట్లు పడుట లాంటి అంశాలు హాస్య సాధారణాలైపోయాయి. ప్రసారవాహినుల లోని వ్యాఖ్యాతల ప్రసంగధోరణులను మనం హాస్యముగానే పరిగణించాల్సి వస్తోంది. ఏతావాతా అర్థవంతమైన హాస్యకథలు వ్రాయుడము అంత సులభము కాదన్న విషయం అవగతమైనదిది.

భారతీయ చలన చిత్రములలో ద్వంద్వార్థ సంభాషణల్ని హాస్యమునకు ఉపయోగించు పద సాధనములుగా వాడుకొనుట ప్రారంభించిన తర్వాత, ఆ తెగులు పరిణితి చెంది, ప్రస్తుతము అశ్లీల పదములు హాస్యముగా చెలామణీ అయిపోతున్నవి. ముంబయ్ మహానగరములో కేవలం ద్వంద్వార్థ సంభాషణలతో ఆద్యంతమూ నడుచు నాటకప్రదర్శనలు విరివిగా జరుగుతోనే ఉంటాయి.

రౌడీ ముఖాల ముదురు బెండకాయలను విద్యార్థులుగా చూపిస్తూ- అధ్యాపకులను అవహేళన చేయుట హాస్యముగా పరిగణింపబడ్తోంది. ఉపాధ్యాయులను, రక్షకభటులను హాస్య పాత్రలుగా సృష్టించుట సర్వసాధారణమైపోయినది. పొట్టిదుస్తులు ధరించిన నాయిక జఘనముల మీద దరువులు వేయుట, అత్తలతో సరసమాడుట ఇత్యాది చిత్రీకరణలు మొరటు హాస్యముగా చూపించు చున్నారు. ప్రతి చిత్రములోనూ "ఐ లవ్ యు" అంటే నేను నిన్ను ప్రేమిస్తున్నాను అను ఊకదంపుడు విన్యాసములు వికట హాస్యముతో తప్పని సరైపోయినవి. ఇలాంటి దృశ్యచిత్రీకరణలో నాయికానాయకులు పడు ప్రయాసలు హాస్యముగా చూపించబడుచున్నవి. ఇవన్నియు సృజనాత్మకు నిదర్శనములన్న కుహనా సంస్కృతి నెలకొనిపోయినది. అయితే విచిత్రమేమనగా 'పలు చిత్రములు కేవలము హాస్యనటుల ప్రతిభా పాటవముల చేతనే విజయము సాధించుచున్నవి' అను మాట సత్యదూరము కాదు. ఈ కారణముగనే ప్రధాన చిత్రమునకు సమాంతరముగా సంబంధములేని హాస్యదృశ్యములను సంధించు చున్నారు.

కథాంతర్భాగముగా నడుచు హాస్యము అంతరించుపోవు చున్నది.
ఒక రేలంగి, ఒక ఎమ్.ఎస్.నారాయణ, ఒక బ్రహ్మానందం తెలుగుతెర గర్వింపదగ్గ హాస్యనటులని, అగ్రగణ్యులని నా అభిప్రాయము. వీరి వాక్శుద్ధి అనితరము.
అశ్లీలమే హాస్యమనుకొంటే నిఘంటువులలో నానార్థాలుగా, పర్యాయ పదాలుగా, గుణవిశేషాలుగా అశ్లీల పదములను అనుసంధానించవలసిన సమయము వచ్చి యున్నది.

---

# ప్రేమంటే ఇంతే

( 37 వ పేజీ తరువాయి)

..."రాధా నేను వూపిరి పీల్చడం మరచిపోయిన రోజునే నిన్ను మరచి పోవడం జరుగుతుంది" అన్నాడు.
"సారీ బావ నీ మనసుకి కష్టం కలిగించే మాట అన్నాను...సరే నాకు బెంగాలీ స్వీట్ తినాలని వుంది, తీపి తిని ఈ మధురమైన కలయిక తీపి గుర్తుగా వుంచుకుందాము" అని అతని గుండెల మీద ముద్దు పెట్టింది.
"సరే పద నీకు ఇవాళ స్వీట్ సింగడా తినిపిస్తాను" అని ఒక బెంగాలీ స్వీట్ షాప్ వద్ద ఆపి రెండురకాల స్వీట్స్ కొని అనూరాధని రాజేశ్వరరావు ఇంటి దగ్గర దింపి తిరిగి బయలుదేరాడు కృష్ణమోహన్.
"బావా మీ ఆరోగ్యాలు జాగ్రత్త, క్రమం తప్పకుండా ఫోన్ చేస్తూ వుండు". ఎంత దాచుదామన్నా ఆగని అనూరాధ కళ్ళలో నీరు గమనించాడు కృష్ణమోహన్.
కారు నడుపుతూ స్టీరియో ఆన్ చేశాడు కృష్ణమోహన్....అనూరాధని ఇలా కలిసి ఒకరి వేదనని ఒకరు పంచుకున్న తరువాత మనసు తేలిక పడింది...స్టీరియోలో వస్తున్న నారాయణరెడ్డి గారి పాట మీదకు దృష్టి వెళ్లింది...
వెన్నెలలెంతగ విరిసినగాని ............ చంద్రున్నీ విడిపోలేవు ...........కెరటాలెంతగ పొంగినగాని
కడలిని విడిపోలేవు ...........కలిసిన ఆత్మల అనుబంధాలు..........ఏ జన్మకు విడిపోలేవులే
తనువులు వేరైన దారులు వేరైన ............ఆ బంధాలే నిలిచేనులే
లావణ్య బాలసారె రోజున బీచ్‌లో అనూరాధ అన్న మాటలు గుర్తుకొచ్చాయి...“ఒక విషయం బావా ఎవరి ప్రేమైనా స్వచ్ఛమైనది, ప్రతిఫలం ఆశించనిది, స్వార్థం లేనిది అయితే శాశ్వతంగా నిలుస్తుంది, బావా నా ఉద్దేశ్యంలో ప్రేమకి పరమార్థం పెళ్ళి, సంసారం, పిల్లలని కనడం కాదు...ప్రేమంటే ఒకరి మంచి ఒకరు కోరుకోవడం...ఒకరి బాధ చూసి ఒకరు చలించిపోవడం...ఒకరి సుఖం కోసం ఒకరు ఆరాటపడటం”
“అవును ‘ ప్రేమంటే ఇంతే’ కదా” అనుకున్నాడు కృష్ణమోహన్.

## ప్రేమంటే ఇంతే ధారావాహికం సమాప్తం


# జానపదులకు, జవసత్వాలు కూర్చిన అవిశ్రాంతపరిశోధకుడు ఆచార్య జయధీర్ తిరుమల్ రావు.



తుమ్మూరి రాంమోహనరావు

“పరిశోధకుడిలో ఉండవలసిందిపరిణతి. మేధావికైనా, రచయితకైనా తప్పక కావలసినవి సమగ్రదృష్టి; సత్య నిష్ఠ. అలాగే కవికి ముఖ్యంగా ఉండి తీరవలసి నవి ఆర్ద్రత, రసజ్ఞత. ఈ లక్షణాలన్నీ ఉన్నవారు జయధీర్ తిరుమలరావుగారు”

-యం.వి.ఆర్. శాస్త్రి, ఎడిటర్,ఆంధ్రభూమి



అప్పట్లో నేను వారపత్రికలు తెగ చదివే వాణ్ని .అలా ఓ వారపత్రికలో వారం వారం రాసేకాలమిస్టుగా జయధీర్ తిరుమల్ రావుఅనేపేరుతో పరిచయం కలిగింది.


ఆ తరువాత డా.సామలసదాశివ మాస్టారు చెప్పే కబుర్లలో అపుడపుడూ జయధీర్తిరుమల్ రావుగారి పేరు వినేవాణ్ని. ఆ తరువాత కొన్నాళ్లకు తాళపత్ర గ్రంధాల సర్వే-జరిగినప్పుడు దాని సంచాలక బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావుగారితో ఫోన్లో మాట్లాడిన గుర్తు.

ఆ సర్వేలో కాగజ్ నగర్ మండలంలో పనిచేసిన సర్వేయర్ లలో నేను ఒకణ్ని.

మరోసారి వరంగల్ విశ్వేశ్వర డిగ్రీకళాశాల వారు వరుసగా మూడు సంవత్సరాలునిర్వహించి జిల్లా సాహిత్య చరిత్రల పరిశోధకునిగా ప్రాచీన, అర్వాచీన, ఆధునికఆదిలాబాద్ జిల్లా సాహిత్య చరిత్ర పత్ర సమర్పణలో భాగంగా,ఆదిలాబాద్ దగ్గరిమానడ గ్రామానికి చెందిన మునిపంతులు రాసిన గోండీ భారతం ఆది సభాపర్వాలు జయధీర్ తిరుమల్ రావుగారి సంపాదకత్వంలో వెలువడిందని

తెలిసి ఆ పుస్తకం కోసంఫోన్ చేస్తే వెంటనే పంపించారు తిరుమల్ రావుగారు. వారి ఔదార్యానికి ఎంత సంబరపడిపోయానో.

ఆ తరువాత సదాశివగారి మరణానంతరం దశదిన కార్యక్రమానికి వెళ్లితే అక్కడ వారిప్రత్యక్ష పరిచయం జరిగింది.ఎంతో ఆత్మీయంగా పలుకరించడంతో మనసులో నిలచిపోయారు. సదాశివగారి ప్రథమ వర్ధంతి సందర్భంగానా సంపాదకత్వంలో 'సదాశివ స్మృతి సుధ' వెలువడింది.




ఆ పుస్తకం ఆవిష్కరణ కాగజ్ నగర్ లో జరిగింది.ఆ పుస్తకం ప్రతి సదాశివ గారంటేచాలా గౌరవం కలిగిన ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు గారికి చేరింది.ఈ లోగా నేనుకాగజ్ నగర్ నుండి మకాం హైదరాబాదుకు మార్చడం జరగటంతో ఏదో సమావేశంలోతిరుమల్ రావుగారిని కలుసుకోవడం,వారు సదాశివ స్మృతిసుధ పుస్తక పరిచయ సభహైదరాబాదులో ఏర్పాటు చేయాలని తలపెట్టడం ఆ పనిలో నేనూ ఆయనతో కలిసితిరగడం ఆయనతో పరిచయం కాస్తా సాన్నిహిత్యంగా మారింది. ఓసారి రాజమండ్రి గౌతమీ గ్రంథాలయ లైబ్రేరియన్ గా పనిచేసి పదవీ విరమణపొందిన సన్నిధానం నరసింహశర్మగారి బ్రౌన్ ఉదాహరణ కావ్య పఠనానికి నన్ను సూచించారు తిరుమల్ రావుగారు. వారుశర్మగారికి సన్నిహితులైన మిత్రులన కావడం వల్ల శర్మగారూ నేను తిరుమల్ రావుగారింట్లో కలుసుకున్నాం. వారి పద్యాలను చదివి వినిపించాను.శర్మగారు సంతృప్తిచెందడంతో హైదరాబాద్ స్టడీ సర్కిల్ లో జరిగిన కార్యక్రమం లో బ్రౌన్ ఉదాహరణపద్యాల కావ్యగానం చేశాను.సభలో డా.కే.వి.రమణ గారు,పొత్తూరి వెంకటేశ్వర్రావుగారుజయధీర్ తిరుమల్ రావుగారున్నారు.సభలోని వారికి నా పద్యపఠనం నచ్చటం నాఅదృష్టం.

ఆ అదృష్టం కలిగించిన జయధీర్ తిరుమల్ రావుగారికి మనసులోనే కృతజ్ఞతలుచెప్పుకున్నాను.

ఈ లోగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటం అనేక సాహిత్య కార్యక్రమాలునిర్వహింపబడటం జరుగుతున్న సమయంలో తెలి తెలుగు సినిమా పాటల రచయితచందాల కేశవరావు స్మారక సభ తలపెట్టారు ఆచార్య జయధీర్ తిరుమల్ రావుగారు.

ఆ సభకు రమ్మంటే వెళ్లాను.వెళ్లగానే నన్ను చందాల కేశవరావుగారి ఓ సినిమాపాటను సభలో పాడాలి అని చెప్పి చందాల కేశవరావు మీద పిహెచ్ .డి చేసినపురుషోత్తమాచార్య గారికి అప్పగించారు.ఆ సభలో ముఖ్య అతిథి జ్ఞాన పీఠ అవార్డుగ్రహీత డా.సి. నారాయణ రెడ్డి గారు.ఆయన ఎదుట బాణీ తెలియని పాటను నాకుతోచిన బాణీలో వినిపించాను.నారాయణ రెడ్డిగారు మెచ్చుకోలుగా కనుబొమలు పైకెత్తిచూశారు.అలా నా జన్మ ధన్యం చేసిన వారు కూడా ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావుగారే.ఓ సారి వరంగల్ వెడుతూ ఫోన్ చేసి ఇంటికి వచ్చి నాభార్యా వియోగంతోబాధలో ఉన్న నన్ను పలుకరించి వెళ్లారు.ఆయన సహృదయతకు ఈ ఉదాహరణలుచాలవా?

అతి నిరాడంబరంగా నెమ్మదిగా తనపని తాను చేసుకునివెళ్లే మనిషి జయధీర్ తిరుమల్ రావుగారు.ఈ జయధీర్ ఆయన పేరు కాదని తనతో జంటకవియైనపి. జయధీర్ అనే ఆప్తమిత్రుని పేరని మా సదాశివ సారు చెప్తే వినడం జరిగింది. పురాణం సుబ్రహ్మ-

ణ్యా శర్మ గారు వీరిద్దరు రాసిన కవితను జయధీర్ తిరుమల్ రావుఅనే పేరుతో ప్రచురిస్తే అది అలాగే కొన సాగించారు రావుగారు.

అలా పరిచయమైన ప్రొఫెసర జయధీర్ తిరుమల్ రావుగారి గురించి ఆయన నిరంతర పర్యటనానుభవాల గురించి, మారుమూల పల్లెలకు వెళ్లి జానపదకళల మూలాలను అన్వేషిస్తూఉండే విషయం గురించీ మెల్ల మెల్లగా తెలియ వచ్చింది

రాష్ట్రంలోని అనేక మంది జానపద కళాకారులను ప్రోత్సహించడమే కాకుండా వారిజీవిత చిత్రాలను అక్షరబద్ధం చేయటంలో అలుపెరుగని సాహితీ కృషీవలుడు ఆచార్యజయధీర్ తిరుమల రావుగారు. ఈయన జానపద సాహిత్య మౌలిక పరిశోధకుడు. కాలగతిలో నిర్లక్ష్యానికి గురైనఉపకులాల బతుకుల, కళల ప్రతిబింబాలను సేకరించాడు. తన పరిశోధన కోసం అతనుతెలంగాణ మారుమూల జనపదాల్లో, గిరిజన తాండాల్లో చెప్పులరిగేలా తిరిగాడు.

“పాలమూరు పరిసరాల్లో ఏడుమెట్ల కిన్నెరమీద పండుగ సాయన్నకథ చెప్పే జక్కుల బాలయ్ వెతుకులాటలో, కడ్డీ తంత్రీ వాద్యం మీద ధర్మపురిరామాయణంలోని సీతకష్టాలు పాడుతూ కన్నీరెట్టుకునే ముత్తులరామస్వామి (వడిడాడి) వింటూ తల్లీనమైనపుడు, కొలనుపాకమాలమఠం పెద్దల్ని చెన్నయ్య పురాణం చెప్పమని బతిమాలినసందర్భంలో , నక్షల్ లో రోజుల తరబడి వొక కళామైకంలో డక్కలి జాంబపురాణాన్ని డాక్యుమెంటేషన్ చేసిన సంబరంలో, రామప్పపరిరక్షణకోసం నడిచిన దివ్వెల జాతరలో , భాషావేత్త బంగారయ్యనిరీడిస్కవర్ చేస్తూ అలవి కాని ఆనందం పొందిన రోజుల్లో, చిందుఎల్లమ్మ తో బెజవాడలో చిట్ట చివరి ప్రదర్శన ఇప్పించి ముఖాముఖగోష్టి నిర్వహించిన అపురూప క్షణాల్లో ,జానపద మ్యూజియమగేలరీల్లో మాత్రమే కనిపిస్తాయన్న కొయ్యబొమ్మల్ని అమ్మపురం పల్లెకడుపునుంచి వెలికి తీసి నగరం నడిబొడ్డున మోతె జగన్నాథంబృందంతో ప్రదర్శన ఏర్పాటు చేసిన వెన్నెల రాత్రుల్లో, హోసూరులోవొరుగు తెలుగు స్త్రీల గొబ్బియాళ్ల ఆటని తెలంగాణ బతుకమ్మతోపోల్చి అబ్బురపడినప్పుడు,గోత్రాలవారికి కులం గుర్తింపు కోసంచేతులు పడిపోయేలా మహజర్లు రాసిన సంఘటనల్లోతిరుమలరావుగారి వెన్నంటి ఉండటం వల్ల....”అంటూ తొవ్వముచ్చట్లకు ప్రత్యక్ష సాక్షియైన ఎ.కె. ప్రభాకర్ గారు తిరుమలరావుగారి కృషి వైవిధ్యాన్ని వివరించటం చూస్తుంటే గొప్ప క్షేత్ర పర్యాటకుడు, పాదరసం లాటి పరిశోధకుడు, నిత్య పథికుడు అయిన తిరుమల రావు గారు ఒక నిశ్శబ్ద చైతన్యంఅని చెప్పాలి.

అట్టడుగు ఉపకులాల నుంచి అతను సేకరించిన సామాజిక సాంస్కృతిక కళాఖండాలప్రదర్శనను, తన నాలుగు దశాబ్దాల శ్రామిక పరిశోధనను 2017 సంవత్సరంలో మూడురోజుల పాటు రవీంద్ర భారతిలో ప్రదర్శించారు రావుగారు.సేకరించిన అమూల్య వస్తుసంచయం తెలుగు విశ్వ విద్యాలయంలో భద్రపరచబడినాయి.

అలాగే స్వాతంత్ర్య సమర కాలంలోనూ, నిజాం పరిపాలనా కాలంలోనూ దొరత నాలనిషేధానికి గురైన సాహిత్యం మీద సాధికారిక పరిశోధనా గ్రంథాన్ని




వెలువరించారు.ఈసమాచారం కోసం దేశంలోని నలుమూలలా పలు ప్రాంతాలు పర్యటించారు ఈయన.

మూడున్నర దశాబ్దాలుగా క్షేత్ర పర్యటన ద్వారా పరిశోధించి, ప్రాచీన గిరిజన సంగీతవాద్యాల సేకరణ మహాయజ్ఞంగా భావించి వాటిని సేకరించి సమాజం ముందుంచినజానపదకళల ప్రేమికుడీయన.ఆ విధంగా ఆ వాద్య పరికరాలను ఒక చోటికి చేర్చి'ఆదిధ్వని' పేరుతో పలు ప్రదర్శనలు నిర్వహించారు.


కనుమరుగవుతున్న మూల సంగీతాన్ని బతికించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, సంగీతంతోనే మానవీయ సమాజం ఆవిష్కృతమవుతుందని ఆయన వివరిస్తూఉంటారు.

తెలంగాణ ఏర్పడిన తరువాత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షపదవిని చేపట్టి పలుతావులు పర్యటించి తెలంగాణ




మాండలిక భాషాభివృద్ధికై పాటుపడ్డారు. భాషాసాహిత్యాలను పరిరక్షించుకోవలసిన బాధ్యత రచయితలదే అంటారు తిరుమలరావుగారు.

చరిత్ర పరిశోధకుడే గాక కవీ, రచయిత కూడా అయిన జయధీర్ తిరుమలరావు గారు ఇంతవరకు 1.తెలంగాణ రైతాంగపోరాటం ప్రజా సాహిత్యం[5], 2. ప్రజాకళా రూపాల పొది (సంభాషణలు-అక్షరచిత్రాలు), 3.సాహిత్య వ్యాసాలు, 4.జానపద చారిత్రక గేయగాథలు5.సాహిత్య విమర్శ 6.దళిత గీతాలు (రెండు భాగాలు) , 7.భాషావరణం (వ్యాసాలు), 8.యుద్ధ కవచం (కాళోజీ గురించి), 9.తొవ్వ ముచ్చట్లు (రెండు భాగాలు), 10.వీరుల పోరుగద్దె మేడారం



(సంపాదకత్వం) 11.ఎనిమిదిదశాబ్దాల రామప్ప పుస్తకాలు వెలువరించారు.

వరంగల్‌లో తేదీ 20 జూన్ 1950. జన్మించిన తిరుమల్ రావు గారి ఇంటిపేరురేపల్లె.వరంగల్లు లోనే కాకతీయ విశ్వ విద్యాలయం ఏర్పడకముందు ఉస్మానియ విశ్వవిద్యాలయ అనుబంధంగా యూనివర్సిటీలో యం.ఏ .పట్టభద్రులయ్యారుతిరుమలరావుగారు.ఆ తరువాత ధర్మపురిలోని సంస్కృత కళాశాలలో కొంత కాలంఅధ్యాపకులుగా పని చేసి అక్కడనుండి తెలుగు అకాడమీ పదేళ్లపాటు సేవలందించారు. తదుపరి తెలుగు యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేసిన జయధీర్తిరుమల్ రావుగారు ఐదేళ్ల పాటు ప్రభుత్వం ఏర్పరచిన తాళపత్ర గ్రంథాలు,రాతప్రతులసర్వే విభాగానికి డైరెక్టరు గా పనిచేసి అనేక ప్రాచీన ప్రతులను సేకరించారు.ఒకవైపుఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే జానపద కళా సంస్కృతిని పరిరక్షించే దిశలో అశేషకృషి చేసిన ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావుగారు కారణజన్ములు. వారి స్ఫూర్తి నవతరానికి మార్గదర్శకంగా, పరిశోధకులకు ప్రేరణగా ఉండాలని అభిలషిస్తూ వారిఅమూల్య కృషికి అభినందనలు తెలియపరుస్తున్నాను.

# మాతృభూమి



అనగా అనగా ఒక అడవి. దాని చుట్టూ ఒక నది వేగంగా పారుతుం టుంది. ఆ అడవిలో, పక్షులూ జంతువులూ అన్నీ ఎంతో ఐకమత్యంతో జీవించేవి. వేగంగా లోతుగా పారే ఆ నదిదాటి ఎవ్వరూ లోపలికి వచ్చే వీలు లేనందున ఆ జీవులకు ఏ ఆపదా వచ్చేది కాదు.

ఏనుగు తాను పెద్ద శరీరం ఉన్న , బలమైన జంతువునని ఎన్నడూ గర్వించేది కాదు. కుందేలు తాను వేగంగా పరుగెడతానని అహంక రించేది కాదు. నక్క తాను తెలివైన దాన్నన్ని త్రుళ్ళి పడేది కాదు. కోయిల తాను బాగా పాడుతానని గీరపోయేది కాదు. గ్రద్ద తనకు మంచి దూరపుచూపుందని , తాను పక్షుల రాజునని దర్పం చూపేదికాదు. ఆస్ట్రిచ్ తాను నేలమీద వేగంగా పరుగెత్త గలనని పొగరు చూపేది కాదు. పిచ్చుక తాను గూడు భద్రంగా ,గట్టిగా కడతానని పొంగిపోయేదికాదు. రామ చిలుక తాను మానవుల్లా మాట్లాడుతానని మిడిసి పడేదికాదు..

ఇలా అక్కడి అన్ని జీవులూ కలసి మెలసి ఎంతో ఆనందంగా జీవిచేవి. ఎవరికేదైనా అవసరం కానీ, ఆపదకానీ సంభవిస్తే అన్నీ కలసి కట్టుగా సాయం చేసేవి. ఏజీవీ ఎవ్వరినీ బాధించేదికాదు. అక్కడ జీవించే ఒక కాకికి వైద్యం తెలిసి ఉండటాన ఎవరికే చిన్న అనారోగ్యం కలిగినా వైద్యం చేసేది.

ఇలా ఉండగా ఒకరోజున ఒక కొత్త పక్షి ఎక్కడి నుంచో తప్పించుకుని ఆ ఆడవిలోకి వచ్చింది. భయ భయంగా అటూ ఇటూ చూస్తూ అక్కడు న్న ఒక పెద్ద మఱ్ఱిమాను చుట్టూ తిరగసాగింది. ముందుగా ఆ చెట్టు మీద విశ్రాంతిగా కూర్చునున్న కోయిలమ్మ ఆపక్షినుండీ వచ్చే శబ్దాన్ని చూసి " మిత్రమా! ఎవరు నీవు ? ఎక్కడనుంచీ వచ్చావు? ఎప్పుడూ నిన్ను చూడనేలేదు ."అని పలకరించింది.

పావురం వచ్చి " ఎవరితో మాట్లాడుతున్నావు కోయిల చెల్లాయ్?" అని అడిగింది. కోయిలమ్మ " పావురమక్కా! ఇక్కడికి ఒక కొత్త మిత్రుడు వచ్చాడు, చూడూ !" అంది.

పావురం " ఎక్కడా! నాకు కనిపించడంలేదే!" అంది. ఆకొత్త పక్షి అటూ ఇటూ ఎగిరి " నేనే . కొత్తగా ఇక్కడికి వచ్చిన దానిని " అంది.

పావురం ఆపక్షికేసి వింతగా చూస్తూ " ఓహో! నీవు ఆకారంలో చాలా చిన్నగా వున్నావు. అందుకే నిన్ను గుర్తించ లేక పోయాను .ఆకుల్లో కలసిపోయి ఉన్నావు. మన్నించు, నీనుండీ వచ్చే శబ్దం వలన నిన్ను గుర్తించాను. "అంది . దానికి కొత్తపక్షి " అలా అనకు మిత్రమా! నా ఆకారాన్ని త్వరగా గుర్తించ డం కష్టమే.నేను చాలా చిన్న దాన్ని" అంది.

పాలపిట్ట వెంటనే పెద్దగా అరుస్తూ అడవంతా తిరిగి వచ్చింది.ఏదైనా కొత్త విషయం కానీ, జరూరు సమావేశం కానీ అవసరమైతే పాలపిట్ట అడవంతా తిరిగి అలా తెలియ జేయడం దానికి కేటాయించిన పని.

ఈలోగా రామచిలుక కొత్త పక్షితో " మిత్రమా! నీకేమైనా ఆహారం కానీ దాహానికి నీరు కానీ అవసర మైతే చెప్పు. బాగా అలసినట్లున్నావు!ఇక్కడ నీకేమీ భయం

ఉండదు. " అనిచెప్పింది.
దానికా కొత్తపక్షి " ఆహా! నీస్వరం ఎంత బావుంది? మిత్రమా! కొత్తదాన్నై నా నన్ను పలుకరించి యోగక్షేమాలు విచారించే మీరంతా చాలా గొప్ప సంస్కారం గలవారు .నాకు తేనె త్రాగితేనే ఆకలి దాహం కూడా తీరేది. ఇక్కడ తేనె లభిస్తుందా!" అని అడగ్గా , పిచ్చుక ముందుకు వచ్చి,

" మిత్రమా ఇటురా ! ఇక్కడున్న గుట్టలో తేనే లభించే పూలు న్నాయి. " అని పక్కనే ఉన్న గుట్టల లోని పూలను చూపింది.
ఆకొత్త పక్షి ఆపూల తేనెను తన పొడవాటి ముక్కుతో త్రాగి వచ్చి చెట్టు కొమ్మ మీద వాలింది. దాని గొంతువద్ద చిన్న గాయం చూసిన లకుముకి పిట్ట "మిత్రమా! నీ గొంతుమీది ఆగాయం ఏంటీ?" అని అడిగింది. దానికా కొత్త పక్షి, కంటినిండా నీరు కారుస్తూ దుఃఖించసాగింది.

"మిత్రమా! బాధపడకు. ముందుగా నీ గాయానికి మా వైద్య మిత్రుడు కాకమ్మక్క మందు రాస్తుంది. కొద్ది సేపటికే నీ గాయం మానిపోతుంది." అని గోరింక అంటుండగానే , కాకమ్మ పక్కనే ఉన్న గుబుర్లలోని ఆకు లు తెచ్చి ముక్కుతో కొరికి ఆరసాన్ని ఆఆకులలోనే ముంచి ఆచిన్నారి కొత్త పక్షి గొంతుకకు రాచింది.

ఈలోగా అడవిలో ఉండే చాలా జంతువులూ,పక్షులూ మఱ్ఱి మానుక్రింది కి చేరాయి.
అక్కడ అంతా చేరగానే ముందుగా అన్నింటికంటే పెద్దగా ఉన్న ఏనుగు "ఏమర్రా! బంగార్లూ! ఎవరో కొత్తవారు వచ్చారని చెప్పి మమ్మంతా పిలిచారు ? ఎక్కడ ? ఎవరా కొత్తవారు? "అంది చూట్టూ తన మెడ , తొండమూ త్రిప్పి చూస్తూ.
చకోరపక్షి " ఏనుగు అన్నా! ఆ మనకొత్త మిత్రుడు ఆకారంలో చాలా చిన్నది, కనిపించడం కష్టమే." అంది
వెంటనే ఆకొత్త పక్షి అటూ ఇటూ ఆచెట్టు చుట్టూ ఎగురుతూ తిరిగింది. అది ఎగురు తుంటే వచ్చిన ఆశబ్దానికి అంతా ఆచిన్నారి పక్షిని చూసి, గుర్తించాయి. అది క్రిందుగా ఉండే మఱ్ఱి మాను ఊడ మీద వ్రాలి అందరికీ కనిపిం చింది.
" మిత్రులారా! మీదెంత మంచి గుంపు. మీ స్నేహం, మీ అతిథి మర్యాదా, మీ మంచితనం నామనస్సును కట్టి పడేస్తున్నాయి. అడక్కుండానే వైద్యం చేశారు. ఆతిధ్యం ఇచ్చారు. అభ యం ఇచ్చారు.మీలాంటి వారిని నాజన్మలో చూడలేదు. మీలో చాలామంది నాకు తెలీనే తెలీదు. ఇదే మొదటి మారుచూట్టం. "అంది.
పావురం ముందుకు వచ్చి " నన్ను పావురం అంటారు. మా జాతిని శాంతికి సంకేతంగా చెప్తారు. మిత్రమా! ముందుగా నీగురించీ మాకంతా పరిచయం చెయ్యి. ఆతర్వాత మావారంతా తమను పరిచయం చేసు కుంటారు."అంది.
దానికా కొత్త పక్షి" మిత్రులారా ! మీ అందరికీ నా వందనాలు. నన్ను హమ్మింగ్ పక్షి అంటారు. మేము ఎగిరేప్పుడు వచ్చే శబ్దాన్ని బట్టి మాజా తికీ పేరు వచ్చింది. మాపక్షులు రెక్కలు కదిలి స్తూ ఎగిరితే ఝుంకారం వంటి శబ్దం వస్తుంది. ఎందుకంటే మేము రెప్పపాటూ కాలంలో 200 సార్లు రెక్కలు ఆడించగలం!- వెనక్కి కూడా ఎగరగలం. ఏపక్షీ మాలాగా వెనకకు ఎగరలేదు. అది మాప్రత్యేకత.
మాజాతి పక్షులం గంటకు 54 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయగలం.
మాపొడవాటి ముక్కులతో పూల మకరందాన్ని త్రాగుతాం.
మాలో మగ పక్షుల ముక్కులు కాస్త పొడుగ్గా, వాడిగా ఉంటాయి. మా పదునైన ముక్కునే మేము కత్తుల్లా వాడుకుంటాం. శత్రువులమీద దాడిచేయనూ ,మమ్ము మేము కాపాడుకోనూ మా ముక్కు లనే ఆయుధాల్లా ఉపయోగిస్తాం.
మా జతపక్షి ఇబ్బందిలో ఉంటే శత్రువులనుంచీ కాపాడను

మగ హమ్మింగ్ పక్షులం ముక్కు ల తో శత్రువుల గొంతుపై గట్టిగా పొడుస్తూ యుద్ధం చేస్తాం. అలా శత్రువుతో పోరాడుతూ నా ప్రాణ రక్షణకోసంనేను ఎగురుతూ దారితప్పి ఇక్కడికి చేరాను. అలా ఐన గాయమే నన్ను బాధకు గురిచేసింది. మీ ప్రేమ , సేవల ద్వారా ఇప్పుడు కాస్త కోలుకున్నాను. మీకందరికీ నా ధన్యవాదాలు" అంది, ఆ హమ్మింగ్ పక్షి.

ప్రత్యేకమైన రంగు కలిగిన హమ్మింగ్ పక్షి రెక్కలు, చెట్లఆకుల్లోంచీ పడే సూర్యకాంతికి మెరిసి పోతుండగా ఆ వింత రంగును చూస్తూ ఆ సభలో అంతా ఆశ్చర్యపోయారు.

ముందుగా కుందేలు "ఓ చిన్నారి మిత్రమా! నీవు చాలా అందంగా , నీ మాటలు చాలా స్నేహ పూర్వకంగా ఉన్నాయి. నీవు ఇష్టపడితే ఇక్కడే ఉండవచ్చు.నీకే ఇబ్బందీ ఉండదు "అంది.

పిచ్చుక అందుకుని " ఓ చిన్నారి మిత్రమా! నీకు కావలిస్తే మాజాతి పక్షులం అందమైన గూడు కట్టివ్వగలం, నీవూ మాలో ఒకరిగా జీవించ వచ్చు." అంది.

"అన్నట్లు నీవు మాలో కొందరిని చూడలే దన్నావు కదా! మా పరిచయం చేసుకుంటాము. నన్ను నెమలి అంటారు. నేను చక్కగా నాట్యం చేస్తా నని మా మిత్రులంతా అంటారు. నన్ను భారత జాతీయ పక్షిగా గుర్తిస్తారు." అంటూ మొదలుపెట్టగానే జంతువులూ ,పక్షులూ అన్నీ వరుసగా తమతమ పరిచయం చేసుకున్నాయి.

చివర్లో ఏనుగు " బుజ్జి మిత్రమా! నీవు మా నివాసానికి రావడం మా అదృ ష్టంగా భావిస్తున్నాం. నీకు ఇష్టమైతే పిచ్చుక చెల్లాయీ,-కుందేలు తమ్ముడూ చెప్పినట్లు ఇక్కడ నివసించవచ్చు. మా నివాసమైన ఈ అడవిలో కావలసినన్ని తేనె పూలున్నాయి.నీకు ఆహారానికేమీ లోటు ఉండదు. " అంది.

మైనా అందికదా "ఎవరైనా తమ సమూహంతో కలసి జీవించాలని కోరు కుంటారు. ఎవరి నివాసం ఎలా ఉన్నా వారికి ఆనందం సమకూర్చు తుంది కదా! తాను ఎంతకాలం ఉండా లంటే అంత కాలం మనతో ఉండమందాం. ఆతర్వాత తన ఇష్టం." అంది.

దానికి హమ్మింగ్ పక్షి " మైనా అక్క చెప్పింది సత్యం. నేను కొంతకాలం ఇక్కడ ఉండి ఆ తర్వాత నామాతృ భూమికేసి వెళతాను. ఇక్కడి వింత లన్నీ అక్కడి నా స్నేహితులందరికీ చెప్తాను." అంది.

అలా పిచ్చుకమ్మ కట్టిచ్చిన కొత్త గూట్లో హమ్మింగ్ పక్షి కొంతకాలం నివసించింది. రోజూ సాయంకాలం అంతా కలసి కబుర్లు చెప్పుకునేవి. అడవిచుట్టూ తిరిగి చాలా వింతలూ విశేషా లూ చూసింది హమ్మింగ్ పక్షి.

అక్కడి జంతువులకూ, పక్షులకూ ఒక్కో దానికీ ఉండే ఒక్కో ప్రత్యేకత గమనించింది. ఐనా అవి వాటికున్న ప్రత్యేక లక్షణానికి గర్వించక అంతా సాధారణంగా ఐకమత్యంతో జీవించడం హమ్మింగ్ పక్షికి చాలా చిత్రంగా ఉంది. 'జీవులంటే ఇలా ఆదర్శంగా ఉండాలి, అప్పుడు ఆపద లేరావు ' అనుకుంది

కొద్దికాలమయ్యాకహమ్మింగ్ పక్షి విచారంగా ఉండటం గమనించిన స్నేహ బృందం." మన మిత్రునికి తన జన్మభూమి, అక్కడి బంధుజనం గుర్తు వచ్చినట్లు న్నారు." అన్నాయి.

"యదార్థం , నాకు నా జన్మభూమి మీద మనసవుతున్నది. ఇక్కడ మీరంతా ఎంతోప్రేమ,అపేక్ష చూపుతున్నా ,నా మాతృభూమి గుర్తు వస్తున్నది. నేను వచ్చి చాలా కాల మైందికదా! మీ సెలవై తే వెళ్ళి వస్తాను."అంది హమ్మింగ్ పక్షి.

ఆబుజ్జి మిత్రునికి అంతా వీడ్కోలు పలికాయి. అది రివ్వున ఆకాశానికేసి ఎగురుతూ బయల్దేరింది. దాని రెక్కలు కదులు తుంటే వచ్చే వింత శబ్దం వింటూ , టాటా చెప్తూ ఆ శబ్దం విని పించేంత వరకూ నిలిచి ,ఆ నేస్తం దూరమైనందుకు విచారిస్తూ, కదలి తమ స్థావరాలకెళ్ళారు అంతా.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనేమాట వాస్తవం కదా!.

# హితోక్తులు

**శాంతితుల్యం తపోనాస్తి**
**న సంతోషాత్పరం సుఖం**
**న తృష్ణయా పరో వ్యాధి :**
**న చ ధర్మో దయాప:**

**భావం**: శాంతి కంటే మించిన తపస్సు లేదు. తృప్తి సంతోషాలకంటే మించిన సుఖం లేదు. పేరాశకి మించిన రోగము లేదు. దయాగుణముని మించిన ధర్మమూ లేదు.

**మాతృ నిందో మహావ్యాధి :**
**పితృ నిందా పిశాచతః**
**దైవనిందా దారిద్రస్యాతం**
**గురునిందా కులక్షయం**

**భావం:** అమ్మను నిందిస్తే వ్యాధి వస్తుంది. నాన్నను నిందిస్తే పిశాచి అవుతాడు. దైవాన్ని నిందిస్తే దరిద్రుడౌతాడు. గురువుని నిందిస్తే కులక్షయం జరుగుతుంది.

**నిశివనితా సుఖ నిద్రా లోలః**
**ప్రాతః పరదూషణ పటుశీలః**
**అంతం యాతి నిజాయుః కాలః**
**కిమ్ జానాతి నరః పశులీల:**


**భావం**: ఎవరి ఆయువు ఎంత? అంతవరకూ బతుకుతాడని నియమం ఏమీలేదు. ఆయువుకాలం ఎంత అంటే చెప్పలేం. చెయ్యాల్సిన పని ఆ కాలం వచ్చేలోపు, ఈ శరీరం వచ్చినందుకు మనం చేయాల్సింది ఆచార్య శ్రీచరణ నామ సంకీర్తనం. ఆచార్యుడు చూపిన భగవంతుని పాదాశ్రయం. ఇది చేసి, వారు అందించే ఆధ్యాత్మిక శక్తితో బ్రతకడం అనేది మనం చేయాల్సింది. అలా చేయలేకపోతే గొప్ప అవకాశాన్ని కోల్పోయినవాళ్ళం అవుతాం. దేవ ఉపనిషత్తు ఇదే చెబుతుంది.

# అమ్మను మించిన దైవము లేదు

తాళ్ళూరి లక్ష్మి

అద్భుతమైన ఈ ధరణి మీద
ఎన్నో మార్పులు... మరెన్నో చేర్పులు
ఋతువులు మారినంత సహజంగా
మానవతా విలువలూ మారిపోతున్నాయి
నేటి సమాజంలో
ఈనాటి మనుష్యుల తీరు చూస్తుంటే
మానవత్వం - ఆదర్శంగా మిగులుతోంది
దానవత్వం - నిర్భయంగా రాజ్యమేలుతోంది
అన్పిస్తుంది

అద్భుతమైన ఈ ధరణి మీద
అమ్మను మించిన దైవం లేదు
అమ్మ రొమ్మున పాలు తాగే
అమ్మ ఒడిలో ఆడుకునే
అమ్మ చేయి పట్టుకుని
నడచిన చిన్నారి బాలుడు
కర్పూరదీపమై అమ్మ చూపిన వెలుగులో
తన బ్రతుకుబాటను చేరిన యువకుడు..
జీవనసంధ్యా సమయమున



దురాశ, ద్వేషం, స్వార్థం, ఈర్ష్య, అసూయ
మనిషిని పూర్తిగా లోబరచుకుంటున్నాయి
ఎందరో మహానుభావులు
వారు చెప్పిన జీవితసత్యాలు
నీతిబోధలుగానే మిగిలిపోతున్నాయి
కులమతతత్వాలు, కుటిల రాజకీయాలు
మానభంగాలు, మారణహోమాలు
మానవజాతి మనుగడకే ముప్పు తెస్తున్నాయి

ఆమెకింత ముద్ద పెట్టడానికే
భారంగా భావిస్తోంటే
తన నిష్క్రమణం
తన బిడ్డకు ఆనందదాయకం కాగా
చేరుతోంది 'వృద్ధుల' ఆశ్రమంలో
చేరుతూ కోరుతోంది
'భగవంతుడా! నా బిడ్డను దీవించ'మని

# మే 25 న
# శ్రీ హనుమాన్
# జయంతి




RNI No. TELTEL/2011/39497
MAY 2022
POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st May
Date of Posting:8th May
Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com .
www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.